ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 26 జూలై 2024 | 5

రూ.5 లక్షల్లోపు పనులు తక్షణం చేపట్టండి

- జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి
- ఆర్‌డబ్ల్యూఎస్ సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూలై25(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రూ.5లక్షల లోపు విలువైన జలజీవన్ మిషన్ పనులన్నీ తక్షణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె జలజీవన్ మిషన్ పనులపై పురోగతిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న జలజీవన్ మిషన్ పథకం పనులు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.489 కోట్లతో చేపట్టిన 670 పనుల్లో 355 పూర్తయ్యాయని 84 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మిగతావాటిని కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.గ్రామీణ ఉపాధి పథకం కింద జిల్లాలో రూ.19.29 కోట్లతో చేపట్టిన 243 డ్రైన్ల నిర్మాణ పనుల్లో 25 పూర్తయ్యాయని,46 పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన పనుల లక్ష్య సాధన పూర్తయ్యేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. సచివాలయాల పరిధిలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సుల(సీఎస్‌సీ) కింద 11.76 కోట్లతో చేపట్టిన 392 పనులకు 331 పనులు పూర్తికాగా, 49 పురోగతిలో ఉన్నాయన్నారు. జీజీఎంపీ కింద రూ.43.58 కోట్లతో 1263 పనులు చేపట్టగా 820 పూర్తయ్యాయని ఇంకా 26 పురోగతిలో ఉన్నాయన్నారు.ఆమోదించిన పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ప్రతిపాదించిన పనుల్లో రూ. 5లక్షల లోపు పనులన్నీ తక్షణం చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, రాజమండ్రి, అనపర్తి, కొవ్వూరు డివిజన్ల డీఈలు టి.శ్రీనివాసబాబు, ఎస్.రవి కుమార్, ఎన్.అప్పారావు, డీఎల్‌డీవో వీణాదేవి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం నా డ్రీమ్ సిటీ

కమిషనర్‌గా కేతన్ గర్గ్ బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25 : చారిత్రక రాజమహేంద్రవరం నా డ్రీమ్ సిటీ.. ఇక్కడికి ఎంతో ఇష్టంతో వచ్చానని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గర్గ్ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ గా గురువారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. తొలుత వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు చేయగా కొబ్బరికాయ కొట్టి కార్యాలయంలోకి ప్రవేశించారు. రాజస్థాన్‌కు చెంది కేతన్ గర్గ్ 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ఐఆర్ఎస్ అధికారి, ఇన్‌కంట్యాక్స్ అధికారి, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, రాజస్థాన్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా ఏడు విభిన్నమైన ఉద్యోగాలు చేశారు. తండ్రి కేదారినాథ్ రిటైర్డ్ డాక్టర్, తల్లి మిథిలేషి గర్గ్ గృహిణి. తల్లి కోరిక మేరక ఐఏఎస్ చేశారు. 2019 -20లో సహాయ ట్రైనీ కలెక్టర్‌గా విజయనగరం జిల్లాలో పనిచేశారు. 2020 ఆగస్టు 10 నుంచి 2022 జనవరి 24 వరకు రాజంపేట సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. 2022 ఏప్రిల్ 4 నుంచి 2024 జూలై 22 వరకు అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇప్పుడు రాజమహేంద్రవరం కమిషనర్‌గా నియమితులయ్యారు. కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ గోదావరి వరద పనులపై దృష్టి పెడతానని..అటుపై నగరంలో సమస్యలు, అభివృద్ధి పనులపై దృష్టి పెడతామన్నారు.అనంతరం కమిషనర్ కేతన్ గర్గ్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిం చారు. కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీఎం.సత్యవేణి, సిటీప్లానర్ జీవీఎస్ఎన్.మూర్తి ఎస్ఈ పాండురంగారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఎస్ఎస్ ఇంద్రగంటి శ్రీనివాసరావు, మేనేజరు మాలిక్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు చాపల శ్రీనివాసరావు తదితరులు పుష్పగుచ్ఛం అందించారు.



కలెక్టర్ ప్రశాంతికి మొక్కను అందజేస్తున్న కమిషనర్ కేతన్ గర్గ్

ఉపాధి పనికొస్తే రూ.300 ఇవ్వాలి

మెటీరియల్ కాంపోనెంట్ రూ. 45 కోట్లు మంజూరు



రాజమహేంద్రవరం సిటీ, జూలై 25 : జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ప్రగతి లక్ష్యాలపై ఆమె సమీక్షించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 30 లక్షల పనిదినాలు కల్పించి రూ.66.7 కోట్ల చెల్లింపులు జరిపినట్టు తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ వేతనదారులకు సగటున వేతనం రూ.300లు చెల్లింపులు జరిగే దిశగా అధికారులు ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీల వేతన లక్ష్యసాధనలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్‌గా రూ.45 కోట్లు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా సీసీ రోడ్లు ,సిమెంట్ డ్రైన్లు గ్రామాల అభివృద్ధికి మరిన్ని పనులను ఈ నిధులతో చేపట్టాలన్నారు. సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ పీడీ ఎ .ముఖలింగం ,అసిస్టెంట్ పీడీ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద మెట్లు దిగువకు గోదావరి



కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద మెట్లపై ప్రవహిస్తున్న అఖండ గోదావరి

గోదావడిలో..

వరద తగ్గింది..బురద మిగిలింది..

- శాంతించిన గోదావరి
- ధవళేశ్వరం వద్ద తగ్గిన ఉధృతి
- రెండో హెచ్చరిక ఉపసంహరణ
- 13.40 అడుగులకు నీటిమట్టం
- దిగువకు 12.27 లక్షల క్యూసెక్కులు
- బురదతో నిండిన రేవులు
- ముంపులోనే వరి పొలాలు
- లంకల్లో వీడని ముంపు
- నష్టం అంచనాల్లో అధికారులు
- భద్రాచలంలో తగ్గుతున్న నీటిమట్టం

రాజమహేంద్రవరం,జూలై 25(ఆంధ్రజ్యోతి)/ కొవ్వూరు : గోదావరికి వరద పెరుగుతూ, తగ్గుతూ తీరప్రాంత ప్రజలతో దోబూచులాడుతుంది. నదీ పరీవాహక ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద ప్రవాహం అధికంగా నదిలో చేరుతుంది. దీంతో గడిచిన 48 గంటల్లో గోదావరికి ఎగువన భద్రాచలం వద్ద వరద ఉధృతి 51.60 అడుగుల నుంచి 44 అడుగులకు తగ్గినట్టే తగ్గి మరలా పెరుగుతుంది. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు 48.30 అడుగులకు మర లా వరద ప్రవాహం చేరుకుంది. గురువారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద 48.60 అడుగులకు చేరింది. గురువారం ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకూ నీటిమట్టం నిలకడగా ఉంది.ఈ పెరుగుదల స్వల్పంగానే ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.గోదావరి ఎగువన మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అక్కడక్కడా వర్షాలు పడుతుండడంతో వరద స్వల్పంగా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.గురువారం రాత్రి 12 గంటలకు 48.30 అడుగులకు నీటిమట్టం చేరింది. ప్రస్తుతం భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ధవళేశ్వరం ఇరిగేషన్ అధికారులు మాత్రం ఇక ఆగస్టు వరకూ గోదావరి తగ్గుతూ పెరుగుతూ ఇలాగే ఉంటుందని చెబుతున్నారు.ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద తగ్గుముఖం పట్టడంతో గురువారం ఉదయం 9 గంటలకు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ బ్యారేజి నీటిమట్టం 13.40 అడుగులు నిలకడగా ఉంది.కానీ క్యూసెక్కుల్లో తేడా ఉంది. సాయంత్రం 6గంటలకు బ్యారేజీ నుంచి 12,30,242 క్యూసెక్కులు సముద్రంలోకి వెళ్లగా ఏడుగంటలకు 12,27,273 క్యూసెక్కులు వెళుతోంది. భద్రాచలం వద్ద పెరుగుతున్న వరద ధవళేశ్వరం చేరుకునేసరికి 18 గంటలు పడుతుంది.దీంతో భద్రాచలం వద్ద గోదావడి ఇలాగే కొనసాగితే ధవళేశ్వరం వద్ద వరద ప్రభావం పెద్దగా ఉండదని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. దీంతో గోష్పాదక్షేత్రంలోని ఆలయాలు ముంపు నుంచి తేరుకున్నాయి. షిర్డీసాయి బాబా ఆలయం చుట్టూ ఇంకా నీరు తగ్గలేదు.క్షేత్రానికి వచ్చే రెండు రహదారులపై వరద తగ్గుముఖం పట్టడంతో బురద పేరుకుపోయింది.బురదలో ఆదమరిచి వెళ్లామా జారి పడడం ఖాయం. క్షేత్రానికి వచ్చే యాత్రికులు,భక్తుల సౌకర్యార్థం వెంటనే శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.అయితే రాజమహేంద్రవరం, కొవ్వూరులో ప్రధాన స్నానఘట్టాలు ముంపులోనే కొనసాగుతున్నాయి. వరద ఉధృతంగా ఉండ డంతో ప్రజలెవరూ నదిలో దిగకుండా పికెటింగ్‌లు కొనసాగిస్తున్నారు.ప్రస్తుత వరదతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఎటువంటి ప్రమాదం లేదని ఏజీఆర్‌బీ అధికారులు చెబుతున్నారు.

ఎర్రకాలువ ముంపు పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి : కలెక్టర్

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఎర్రకాలువ ముంపు నుంచి శాశ్వత పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఇరిగేషన్ అధికార్లను ఆదేశించారు.స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎర్రకాలువ ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు.ఎర్రకాల్వ సమస్యను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లనున్నారని తెలిపారు.ప్రతి ఏడాది ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలకు ఎర్రకాల్వకు వరద పోటెత్తడంతో జిల్లా లోని నల్లజర్ల, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం తదితర మండలాల్లోని పంటలకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. దీంతో పాటు రహదారులు ఛిద్రమైపోతున్నాయన్నారు. ఈ మేరకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏలూరు ఇరిగేషన్ ఎస్ఈ సిహెచ్.దేవ ప్రకాశరావును ఆదేశించారు. జంగారెడ్డిగూడెం కొంగువారిగూడెం వద్ద ఎర్రకాలువ ప్రాజెక్టు 4.42 టీఎంసీల కెపాసిటీతో ఉందన్నారు. అధిక వర్షాల వల్ల 17 వేల క్యూసెక్కుల నీటిని వదిలేయడంతో కింది ప్రాంతాల్లో సమస్య ఏర్ప డుతుందని చెప్పారు.తాడిపూడి ఎత్తిపోతల పథకం పరిధిలో భారీ వర్షాల వల్ల గట్టు తెగిపోయి ఇబ్బందులు వస్తున్నాయని నిధులు మంజూరు చేయాలని తాడి పూ డి డీఈ పి.బాలకృష్ణ కలెక్టర్‌ను కోరారు. ప్రతిపాద నలు సిద్ధం చేసి ఇవ్వాలని నిధులు విడుదల చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.సమావేశంలో ఇరిగేషన్ డీఈ కె.రవీంద్ర బాబు, తాడిపూడి డీఈ పి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొట్టుకుపోయిన కాజ్‌వే

నల్లజర్ల,జూలై 25 : ఎర్రకాల్వ వరద ఉధృతికి 30 ఏళ్ల కిందట టీడీపీ హయాంలో నిర్మించిన కాజ్‌వే బ్రిడ్జి కొట్టుకుపోయింది.దీంతో పుల్లలపాడు,మారెళ్ళమూడి,ఆవపాడు,సింగరాజుపాలెం గ్రామా రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.నిన్నటి వరకు నీరు ప్రవాహించడంతో బ్రిడ్జి కింద తూరలు ఉన్నాయని రైతులు అనుకు న్నారు.గురువారం ప్రవాహం తగ్గడంతో బ్రిడ్జితో పాటు తూరలు సైతం కొట్టుకుపోయి దర్శనమిస్తుంది.గతంలో పుల్లలపాడు ఊరచెరువు నిండితే వీరమ్మ చెరువులోకి నీరు వెళ్లేలా పుల్లపాడు,మారెళ్ళమూడి గ్రామాల మధ్య కాజ్‌వే బ్రిడ్జి నిర్మించారు.మొన్నటి వరకు రైతులు ఆ దారి వెంట వెళ్లి వ్యవసాయ పనులు చేసుకునే వారు. వరదల ఉధృతి ఎక్కువగా ఉండడంతో పుల్లలపాడు రైతులు నల్లజర్ల మీదుగా మారెళ్ళమూడి వచ్చి పనులు చేసుకున్నారు.

10043 హెక్టార్లలో పంట నష్టం

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



రాజమహేంద్రవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, ఎర్రకాలువ, కొవ్వాడ కాలువ, బురద కాలువల వరదల వల్ల జిల్లాలో వరిపంటకు నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 60,450 హెక్టార్లలో వరి నాట్లు వేయగా, 13,300 హెక్టార్లలో నాట్లు మునిగిపోయాయన్నారు. 10043 హెక్టార్లలో నాట్లు వేసి 40 రోజులకంటే ఎక్కువైన పంటకు నష్టం జరిగిందన్నారు. 3180 హెక్టార్లలో 40 కంటే తక్కువ రోజులైన పంటకు నష్టం వాటిల్లిందన్నారు. జిల్లాలోని 16 మండలాల్లోని 179 గ్రామాల పరిధిలో 15,259 మంది రైతులకు కష్టం కలిగిందన్నారు. మొక్కజొన్న,చెరకు, మినప పంట కూడా కొంత ఉందన్నారు. దీని కోసం 800 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని పేర్కొన్నారు.

మునిగిన లంకలు..

పెరవలి, జూలై 25 : గోదావరి వరదకు మండల పరిధిలో ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ఖండవల్లి, ముక్కామల గ్రామాల పరిధిలో లంక భూముల్లో నీరు చేరింది. గోదావరి వరద తగ్గినా ఇక్కడ మాత్రం వరద లాగలేదు. అరటి, కూరగాయలు, పామాయిల్‌తోటల్లోకి నీరు చేరింది. ఈ వరద నీటికి అరటి వంటి పంటలకు పెద్దగా నష్టం లేకపోయినప్పటికీ కూరగాయలు పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే గత రెండు రోజులుగా వర్షం కూడా లేకపోవడం తో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.



శాంతించిన ఎర్రకాల్వ

నల్లజర్ల,జూలై 25 : ఎర్ర కాల్వ నిలకడగా ప్రవాహిస్తోంది. దీంతో నిడదవోలు, నల్లజర్ల మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.మండలంలో పలు గ్రామాల్లో వరద ఉధృతికి పంట చేల గట్లుపై పెద్ద పెద్ద గండ్లు..ఇసుక తెన్నులు పేరుకుపోయి పంటను నష్టపోయారు.ఈ నేపథ్యంలో నష్ట పరిహారానికి రైతులు ఎదురు చూస్తున్నారు. నల్లజర్ల మండలంలో 1800 ఎకరాలు నీట మునిగినట్టు ప్రాథమిక అంచనా వేశారు.ప్రస్తుతం 1000 ఎకరాలు మాత్రమే నీట మునిగినట్లు గుర్తించామని ఏవో కమల్ రాజ్ పేర్కొన్నారు.ఎర్ర కాల్వ పొంగి ప్రవాహిస్తుందని అధికారులు ముందస్తుగానే అనంతపల్లి,గుండేపల్లి గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.అధికారులు బలవంతంగా రెండు రోజులు తీసుకుని వచ్చినప్పటికి తమ ఇళ్ళకు వరద నీరు రాలేని మా ఇళ్ళ వద్దే ఉంటామని చెప్పడంతో కలెక్టర్ సైతం వారిని రెండో రోజే ఇళ్లకు పంపించారు.



పెరవలి మండలం తీపర్రు వద్ద జారిన ఏటిగట్టు

ఏటిగట్టు భయపడేటట్టు!

- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ
- పటిష్టత పనులు గాలికి..ఏటిగట్ల పటిష్టత కరవు
- ఇష్టానుసారంగా తవ్వేసిన ర్యాంపులు
- రూ.150 కోట్లతో బ్యారేజీకి కూటమి ప్రతిపాదనలు

రాజమహేంద్రవరం- జూలై 25(ఆంధ్రజ్యోతి) : ఏటిగట్టు.. భయపడేటట్టు ఉంది. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉభయ గోదావరి జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతంలోని గోదావరి ఏటిగట్ల పటిష్టత లేకుండాపోయింది. గోదావరి కుడి ఎడమ గట్లు పొడవు 530 కిలోమీటర్లు. ధవళేశ్వరం బ్యారేజీ ఎగువన 80 కిలోమీటర్లు ఉండగా దిగువన కోనసీమ, తూర్పు, పశ్చిమ జిల్లాల పరిధిలో 450 కిలోమీటర్ల ఏటిగట్లు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గోదావరి జిల్లాలోని ఏటిగట్లు, ధవళేశ్వరం బ్యారేజీతో పాటు అనేక అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు, లాకులను పట్టించుకునే నాథుడే లేకపోయాడు. 2014- 19 మధ్య టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించిన పనులను వైసీపీ పట్టించుకోలేదు. గోదావరి డెల్టా ఆధునికీకరణను గాలికొదిలేసింది. గోదా వరి అంటే కేవలం ఇసుక దోపిడీ కోసం వినియోగించుకున్నారు. ఇష్టానుసారం ర్యాంపులను తవ్వేశారు.. గట్లను గుల్ల చేసేశారు. అదే ఇప్పుడు ప్రమాదకరంగా మారింది. ఎక్కడైనా గట్టు తెగిందా 1986 రిపీట్ అయ్యే అవకాశం ఉంది. గతేడాది వరద ఇలానే భయపెట్టింది.. రికార్డు స్థాయికి పెరిగి తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. 2022 జూలైలో భారీ వరదలు వచ్చినపుడు అప్పటి సీఎం జగన్ రాజమహేంద్రవరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమీక్ష చేశారు. ప్రతిపాదనలు సిద్ధంచేస్తే అక్టోబరు నుంచే పనులు ఆరంభించి 2023 వరదల సీజన్ నాటికి పటిష్టపరుద్దామని ప్రకటించి ప్రతిపాదనలు సిద్ధం చేయమన్నారు. కోనసీమలో పర్యటించి రూ.150 కోట్లు తక్షణం ఇస్తున్నానని గట్లను పటిష్టం చేయాలని ప్రకటించారు. అధికారులు రూ.1500 కోట్లతో ప్రతిపాదించి అప్పట్లో ప్రభుత్వానికి పంపించారు. అయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అది ప్రస్తుతం పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో గోదావరి గట్లు బలహీనంగా ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ఆరికరేవుల- కుమారదేవం, ఏజీఎల్‌బీలోని షిర్డీ సాయి గుడి వెనుక, కూళ్ల- సుందరపల్లి, రాజోలు, పీఐపీ ఫ్లడ్ బ్యాంక్ పనులు అత్యవసరంగా చేయవలసి ఉంది.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తాత్కాలిక పనులు కొన్ని చోట్ల అత్యవసరంగా మొదలు పెట్టింది.దవళేశ్వరం బ్యారేజీని వైసీపీ నిర్లక్ష్యం చేసింది.బ్యారేజీ ఎక్విప్‌మెంట్‌ను ఎలానూ పట్టించుకోలేదు. కనీసం రోడ్డు వేయలేకపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం నారా చంద్రబాబునాయుడు ఈ బ్యారేజీ మీద దృష్టి కేంద్రీకరించారు. రూ.150 కోట్ల ప్రతిపాదనలతో ఇరిగేషన్ అధికారులు ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు. త్వరలో ఈ బ్యారేజీకి మహర్దశ రానున్నది.



బురద మిగిలింది : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వరద తగ్గడంతో మిగిలిన బురద



నష్టమెంత : శింగవరంలో రైతులతో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



కష్టమే : రాజమహేంద్రవరం రూరల్ కాతేరు వద్ద నీటి ముంపులోనే పొలాలు



సీతానగరం మండలం బొబ్బిల్లంక వద్ద సిద్ధంగా ఉంచిన ఇసుక బస్తాలు

అంగన్‌వాడీ గుడ్డు.. వెరీ బ్యాడ్



తాళ్ళపూడి, జూలై 25 : ఆ గుడ్డు చూస్తే గుండె గుబేల్ మంటుంది.. కాంట్రాక్టరు అశ్రద్ధ.. నిర్లక్ష్యం కారణంగా తల్లులు.. పిల్లలకు ఆపై గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలన్న ప్రభుత్వ ఉద్దేశం నీరు కారుతోంది. తాళ్ళపూడి మండలం అన్నదేవరపేట 96వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారనే సమా చారం కూటమి నాయకులకు అందింది. దీంతో హుటాహుటిన అన్న దేవరపేటకు చెందిన టీడీపీ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించగా కుళ్లిన కోడిగుడ్లు దర్శనమిచ్చాయి. ఇదే మిటని అక్కడ ఉన్న సిబ్బందిని ప్రశ్నించగా తమకు సరఫరా చేసిన గుడ్లు సగానికి సగం కుళ్లిపో తున్నాయని చెప్పడం గమనార్హం. కాం ట్రాక్టర్ వారానికి ఒకసారి సరఫరా చేయాల్సిన గుడ్లు 15 రోజు లకొక సారి వేస్తున్నారని అంతేకాక వారు ఎప్పుడు తెస్తే అప్పుడు తీసుకోవాలని సిబ్బంది వాపోతున్నారు.

పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు మోక్షం

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే బత్తుల వినతి



రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం భూసేకరణ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎత్తిపోతల పథకం సమస్యను పరిష్కరించాలని గురువారం అసెంబ్లీలో బలరామకృష్ణ చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన సీఎం వెంటనే స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారని తెలిపారు.పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం, చినకొండేపూడి, నాగంపల్లి గ్రామాల రైతులు తమ భూములు ఇవ్వగా 93 మంది రైతుల పరి హారం పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి ఇక్కడి సమస్యను తీసుకుని వెళ్లినట్టు చెప్పారు. సంబం ధిత ప్రిన్సిపల్ సెక్రటీలకు సమస్య వివరించానన్నారు. సీఎం ఆదేశా లతో త్వరలోనే సమ స్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

జయజయహే..భారత్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 25: భారత్ సైన్యం పాకిస్తాన్‌పై విజయం సాధించిన దానికి ప్రతీకగా కార్గిల్ విజయ దివస్ దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందికొండ రమేష్ అన్నారు. భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో కార్గిల్ విజయ దివస్ గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆర్ట్స్ కళాశాల నుంచి లాలాచెరువు అమరవీరుల పార్కు వరకు ర్యాలీ చేశారు. అక్కడ అమరజవాన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ దేశ ప్రధాని మోదీ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా చేపట్టారని చెప్పారు. మాజీ సైనికుడు లెఫ్టినెంట్ కల్నల్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ 1999 మే 3న కార్గిల్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి భారత్-పాకిస్థాన్ యుద్ధం ప్రారంభమైందన్నారు. జూలై 26న భారత్ భూభాగంలోకి ప్రవేశించిన పాకిస్థాన్‌ను తరిమికొట్టి భారత్ విజయం సాధించిందని చెప్పారు. అప్పటి నుంచి కార్గిల్ విజయ దివస్ జరుపుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణ, కురగంటి సతీష్, కాలేపు సత్యసాయిరామ్, కందుకూరి మనోజ్, మరకాని సతీష్, షేక్ సాజిద్, ఖండవల్లి సాయి, నుంకర బాలు తదితరులు పాల్గొన్నారు.

కట్టె...



పట్టె...



తెచ్చె...



గోదావరి వరద ప్రవాహంలో విలువైన కలప కొట్టుకొస్తోంది.. వరద గోదావరిలో గత మూడు, నాలుగు రోజులుగా ఎక్కువగా కట్టెలు వస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం వద్ద గోదావరిలో కొట్టుకొచ్చిన కట్టెలు, పుల్లలను పలువురు సేకరించి వాహనాలపై తరలిస్తున్నారు.

- మండపేట

గోదావరి మరింత తగ్గుముఖం

- దవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- 13.40 అడుగులకు చేరిన నీటిమట్టం
- 12.27లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 25: గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద గురువారం ఉదయం 9 గంటలకు నీటిమట్టం 13.70 అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఈ సమయంలో 12,27,028 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. నెమ్మదిగా తగ్గుతూ రాత్రి 7గంటల సమయానికి 13.40 అడుగులకు చేరుకుంది. 12,27,273 క్యూసెక్కులు బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తోంది. ఎగువున భద్రాచలం వద్ద 45.20 అడుగుల వరకు తగ్గిన నీటిమట్టం ఇంద్రావతి నుంచి వస్తున్న వరద నీటితో 24 గంటల వ్యవధిలో మూడున్నర అడుగుల వరకు పెరిగి గురువారం సాయంత్రానికి 48.60 అడుగులుగా నమోదైంది. ప్రస్తుతం నిలకడగా కొనసాగుతుండగా ఇంద్రావతి నుంచి వచ్చే వరద నీరు తగ్గడంతో భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుముఖం పట్టనుంది.

ఎగువున అన్ని ప్రాంతాల్లో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. గురువారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద 11.07 మీటర్లు, పేరూరు వద్ద 16.33 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 13.20 మీటర్లు, భద్రాచలం వద్ద 48.60 అడుగులు, కూనవరం వద్ద 20.17 మీటర్లు, కుంట వద్ద 11.50 మీటర్లు,పోలవరం వద్ద 12.90 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.62 మీటర్లుగా నీటిమట్టం నమోదయ్యింది.



బ్యారేజీ గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు



జెన్‌కో కాలనీలో కొండ చిలువ కలకలం

మోతుగూడెం, జూలై 25: మోతుగూడెం లోయర్ సీలేరు ప్రాజెక్టు జెన్‌కో కాలనీ పోస్టాఫీసు వీధిలో పది అడుగుల కొండ చిలువ కలకలం సృష్టించింది. బుధవారం అర్ధరాత్రి కుంపోతగా వర్షం కురుస్తున్న సమయంలో పొట్టునూరి స్వర్ణ ఇంట్లో మంచం కింద చుట్టుకుని ఉన్న కొండ చిలువ కనిపించింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు భయాందోళనకు గురై చుట్టుపక్కల వాళ్లని పిలిచారు. ట్రాక్టరు డ్రైవరు చిన్నారావు ఆటో డ్రైవరు నాగకోన శంకరరావు కొండ చిలువను చాకచక్యంగా పట్టుకుని ప్లాస్టిక్ సంచిలో వేసి సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.





ఎజికొడేరులో వరద బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వరద నీటిలో వరరామచంద్రపురం మండలం శ్రీరామగిరి

నెమ్మదించిన శబరి

చింతూరు వద్ద నీటమట్టం 37 అడుగులు

చింతూరు, జులై 25: శబరి ఉధృతి నెమ్మదిగా తగ్గుతోంది. అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతూరు వద్ద నీటిమట్టం గురువారం రాత్రికి 37 అడు గులకు చేరుకుంది. చింతూరు డివిజన్‌లోని వాగులు, వంకల్లో ఇంకా వరద నీరు ఉండడంతో రాకపోకలు సాగట్లేదు. దీంతో ఆయా ప్రాంతాల వాసులు నాటు పడవలపై ప్రయాణం చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి తిరిగి 48.6 అడుగులకు చేరుకుని నిలకడగా ఉంది. దీంతో కూనవరం, వర రామచంద్రపురం మండలాల్లో గోదావరి ఎగపోటు ప్రభావం కన్పిస్తోంది. చింతూరు మండలం డొంకరాయి జల విద్యుత్ కేంద్రం రిజర్వాయరు నుంచి ఒక్క గేటు ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఆ నీరంతా శబరిలోకి చేరుతోంది. చింతూరు డివిజన్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ దినేష్‌కుమార్ బృందం విస్తృతంగా పర్యటిస్తోంది. బాధితులకు అందుతున్న సహాయ సహకారాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు రేషన్‌తో పాటు కందిపప్పు, వంటనూనె, నిత్యావసరాలు అందజేస్తున్నారు.

మండలానికో ఐఏఎస్ అధికారి

చింతూరు డివిజన్లో 177 గ్రామాలు వరద ప్రభావితమయ్యాయి. బాధితులకు సహకారాలు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన చింతూరు మండలంలోని ఎజికొడేరు, మల్లెతోట, ఉలుమూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతూరు డివిజన్లో వరద బాధితులకు సహాయ సహకారాలు అందజేసే విషయంలో పూర్తిస్థాయి పర్యవేక్షణ చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ప్రతి మండలానికి ఒక్కో ఐఏఎస్‌ను నోడల్ అధికారిగా నియమించారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య... మండలానికి ఒకరు వంతున పర్యవేక్షణ చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. వారికి తోడుగా చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నారు.



డొంకరాయి జలాశయం నుంచి దిగువకు నీటిని వదిలిన దృశ్యం

పెరిగిన నీటిమట్టం

డొంకరాయి జలాశయం నుంచి 2173 క్యూసెక్కుల నీరు విడుదల

మోతుగూడెం, జూలై 25: విడవకుండా కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయంలో నీటిమట్టం బుధవారం అర్ధరాత్రి 1036 అడుగులకు పెరిగింది. జెన్‌కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక గేటును రెండు అడుగులు ఎత్తి 2,173 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామని జెన్‌కో ఈఈ విజయ్ కుమార్ తెలిపారు. దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని, ఇన్‌ఫ్లోస్ తగ్గితే నీటి విడుదల నిలిపివేస్తామన్నారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి



మృతుడు కాళహస్తి (పాత చిత్రం)

ఏలేశ్వరం, జూలై 25: ఏలేరు కాలువలో పడి మండలంలోని మర్రివీడు శివారుకు చెందిన ముంగర కాళహస్తి (57) మృతి చెందాడు. కాళహస్తి మర్రివీడు నుంచి ప్రాజెక్టుకు వెళ్లే కాలువలో చేపలు పట్టడానికి గురువారం దోనెపై వెళ్తుండగా నీటి ప్రవాహం, గాలికి అది హఠాత్తుగా నీటితో మునిగిపోయింది. సమీపాన ఉన్న గ్రామస్తుడు చంద్రయ్య ఇచ్చిన సమాచారం మేరకు కాలువలో గాలించినా ఆచూకీ తెలియలేదు. తన భర్త ఆచూకీ తెలియట్లేదని కాళహస్తి భార్య లక్ష్మి ఏలేశ్వరం పోలీసులకు సమాచారం అందించింది. దీంతో వారు గాలింపు చర్యలను ఉధృతం చేశారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు కాలువ వద్ద మృతదేహం లభ్యమైంది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి హుండీల ఆదాయం రూ.26.80 లక్షలు

అయినవిల్లి, జూలై 25: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో హుండీలను దేవదాయ శాఖ జిల్లా అధికారి డి.నాగమల్లేశ్వరరావు, తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో గురువారం తెరిచి కానుకలను లెక్కించారు. 63 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.25,70,643, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.1,09,702... మొత్తం రూ.26,80,345 ఆదాయం వచ్చింది. 11 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి. లెక్కింపులో ముక్తేశ్వరం ఎస్‌బీఐ ప్రతినిధులు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు టీటీడీ అధికారుల రాక

సత్యదేవుని ఆలయ శిఖరం స్వర్ణతాపడం అంచనాకు పరిశీలన

అన్నవరం, జూలై 25: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని ఆలయ శిఖరం స్వర్ణతాపడం చేయించాలనే ప్రతిపాదనకు దేవదాయ శాఖ కమిషనరు అనుమతి లభించిన సంగతి తెలిసిందే. అంచనాల కోసం టీటీడీ జ్యూయలరీ విభాగం అధికారులు శుక్రవారం పరిశీలన చేయనున్నారు. గతంలో ఒకసారి పరిశీలించగా సుమారు 11 కేజీల బంగారం పడుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే పూర్తిస్థాయిలో నివేదికను శుక్రవారం తయారు చేసి కమిషనర్ అనుమతితో దాతల సహకారంతో దీనిని ఏర్పాటుచేయాలని ఆలోచన చేస్తున్నారు.

సీఐల బదిలీలకు రంగం సిద్ధం!

- మన్యం సహా కీలక స్థానాల కోసం ఎమ్మెల్యేల వద్ద పైరవీలు
- కొన్ని నియోజకర్గాల్లో పెద్ద ఎత్తున సాగుతున్న బేరసారాలు
- ఆయా సీఐల గత చరిత్రను పరిశీలించాకే పోస్టింగ్

రంపచోడవరం, జూలై 25: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పోలీసు శాఖలో ఆయా రేంజ్‌లలో కీలకమైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎమ్మెల్యేల వద్ద పైరవీలు మొదలయ్యాయి. మన్యంతో పాటు 19 నియోజకవర్గాల్లో అనేక స్టేషన్లు, సర్కిళ్లకు సీఐలను బదిలీ చేయడం అనివార్యం కానుంది. ఏ నియోజకవర్గంలో ఎవరుండాలన్న అంశంపై ఎమ్మెల్యేల కంటే ఆయా సీఐలకే ఎక్కువ క్లారిటీ ఉంది. వారు తమకు నచ్చిన స్థానం కోసం బేరసారాలు సాగిస్తూ దళారులతోను, నేరుగాను పావులు కదుపుతున్నారు.

కొందరు సీఐలను ఎన్నికల సంఘం నియమావళి మేరకు ఎన్నికలకు ముందే ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. వారంతా తిరిగి ఉమ్మడి తూర్పుతో ఏదో ఒక కీలక స్టేషనే, సర్కిలో లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. వైసీపీతో పూర్తిగా అంటకాగి కొందరు, గోడ మీద పిల్లి వాటంలా మరికొందరు ఉంటే అప్పటి ఎమ్మెల్యేలకు అనుకూలం కాక లూపు లైన్లలో ఇంకొందరు ఉండిపోయారు. ప్రభుత్వం ఏది ఉన్నా పైరవీలు సాగించడంలో చేయితిరిగిన సదరు సీఐలు ఇప్పుడు కూడా ముందు వరుసలోనే ఉన్నారు. మరికొందరైతే గతంలో ఆయా ప్రాంతాల్లో తమకు పరిచయం ఉన్న ద్వితీయ శ్రేణి నాయకత్వాలను దళారీలుగా ఉపయోగించుకుని పైరవీలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల ఆయా స్థానాలకు రేట్లు కూడా పలికాయి. కాకినాడ, రాజమహేంద్రవరం పరిధిలో 15 నుంచి 30 లకారాలకు పైగా పలికించి గిరాకీ పెంచారు. మరికొందరైతే తమకు వచ్చే వాటిలో కూడా వాటాలు చెల్లిస్తామన్న భరోసా కూడా ఇస్తున్నారు.

ఈ వ్యవహారాలు ఇలా సాగుతుండగా ఆయా రేంజ్ డీఐజీల ద్వారాను, హోం మంత్రి ద్వారాను ఎమ్మెల్యేల సిఫార్సులను అందుకుంటున్న ప్రభుత్వం ఈ అంశంలో కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చిన ప్రతి సిఫార్సులోని సీఐల గత చరిత్రను జిల్లాతో పరిచయం ఉన్న ఓ పోలీసు ఉన్నతాధికారితో పరిశీలన సాగించుకుని పర్వాలేదు అనుకున్న వారికి మాత్రమే పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతే కాకుండా గత ప్రభుత్వంలో అకారణంగా పక్కనపెట్టబడిన వారిని కూడా పరిశీలనలోకి తీసుకుని ప్రాధాన్యమివ్వాలని చూస్తోంది.

రేపు, ఎల్లుండి ఎస్పీ బాలు స్వర స్మరణోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 25: ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలు స్వర స్మరణోత్సవాన్ని ఈ నెల 27, 28 తేదీల్లో విక్రమ హాల్లో నిర్వహిస్తున్నామని రాకా సంస్థ ప్రధాన కార్యదర్శి జి.రమణ తెలిపారు. రాజమహేంద్రవరం రాకా సాంస్కృతిక సంస్థ, ధవళేశ్వరం గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎస్పీ బాలు పాటల పోటీలు ఉంటాయని, బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. వివరాలకు 832805 9683, 91007 53156 నెంబర్లలో సంప్రదించాలన్నారు. సంగీత ప్రియులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పేకాట శిబిరంపై పోలీసుల మెరుపుదాడి

14మంది అరెస్టు, రూ.77వేలు స్వాధీనం

మండపేట, జూలై 25: ఏడిద శివారు చింతాలమ్మ గుడి సమీపంలో దుళ్ల వెళ్లే రోడ్డులో ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో పేకాట శిబిరంపై గురువారం దాడి చేసినట్టు మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్ తెలిపారు. కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలు, యానాం తదితర ప్రాంతాలకు చెందిన 14మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.77,260 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై రూరల్ ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అవినాష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుధాలక్ష్మి

అంతర్జాతీయ చదరంగం పోటీలకు సాయిఅవినాష్ ఎంపిక

మామిడికుదురు, జూలై 25: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మొగలికుదురు శ్రీచైతన్య స్కూలు విద్యార్థి పి.సాయిఅవినాష్ అంతర్జాతీయ స్థాయి చదరంగం పోటీలకు ఎంపికయ్యాడు. 8వ తరగతి చదువుతున్న అవినాష్ ఇటీవల పంజాబ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిపోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ సుధాలక్ష్మి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని శ్రీచైతన్య ఏజీఎం పార్థసారథి, ఆర్ఐ రాజ్‌కుమార్, అడకమిక్ కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, డీన్ రమేష్ గురువారం అభినందించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

11 సంవత్సరాల తర్వాత తుది తీర్పు ఇచ్చిన కోర్టు

జగ్గంపేట, జూలై 25:

హత్య కేసులో నిందితుడైన జగ్గంపేటకు చెందిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గురువారం కోర్టు తీర్పునిచ్చింది. దీనికి సంబంధించి జగ్గంపేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2013లో జగ్గంపేట శెట్టిబలిజపేటకు చెందిన వానశెట్టి సింహాచలం తన భార్య అక్రమ సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో ఒక వ్యక్తిపై దాడి చేశాడు. అక్కడి నుంచి నేరుగా తన భార్య అక్రమ సంబంధానికి కారణమైన శెట్టిబలిజపేటకు చెందిన బత్తిన భవాని ఇంటికి వెళ్లాడు. ఆమె భోజనం చేస్తుండగా కల్లుగీసే కత్తితో నరికి చంపాడు. దీనిపై 2013లోనే జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి దర్యాప్తు చేపట్టగా గురువారం కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. దాదాపు 11 సంవత్సరాల తర్వాత తుది తీర్పు వెలువరించింది. అయితే దర్యాప్తును నిర్ణీత సమయంలో పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసిన అప్పటి సీఐ పి.భరత్‌మాతాజీ, డీఎస్పీ బి.సూర్యఅప్పారావు, ప్రస్తుత సీఐ ఎస్.లక్ష్మణరావు, పీపీ మృత్యుంజయరాజులను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అభినందించారు.

పీడీఎస్ బియ్యం కలిగిన 13 గొడౌన్లపై క్రిమినల్ కేసులు నమోదు

దర్యాప్తు చేస్తున్నామన్న కాకినాడ పోర్టు సీఐ సుమంత్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 25: పీడీఎస్ బియ్యం కలిగి ఉన్న నేపథ్యంలో కాకినాడ జిల్లాలో 13 గొడౌన్ల యాజమాన్యాలపై పోలీసులు తాజాగా క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ కట్టి దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రధానంగా కాన్‌కోర్ బియ్యం గొడౌన్, ఎస్ఆర్ జ్యోతి, హెచ్ గొడౌన్, అశోకా ఇంటర్నేషనల్, సార్టెక్స్ ఇండియా, సాయితేజ షిప్పింగ్ సర్వీసెస్, విశ్వప్రియ ఎక్స్‌పోర్ట్స్, లావణ్య ఇంటర్నేషనల్, అయ్యప్ప ఎక్స్‌పోర్ట్స్, శ్రీనివాసా ట్రేడింగ్ అండ్‌కో, సరళ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బ్లూఓషియన్ మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్, సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీలపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. పీడీఎస్ (కెర్నెల్స్) పోర్టిఫైడ్ బియ్యాన్ని రాష్ట్రంలో ఎక్కడెక్కడి నుంచి సేకరించారు, దీన్ని కాకినాడ పోర్టుకు ఎలా తరలిస్తున్నారు, తర్వాత ఇతర దేశాలకు ఎలా ఎగుమతి చేస్తున్నారు... అనే కోణంలో దర్యాప్తు సాగుతున్నట్టు తెలిసింది. గత నెలలో చేసిన దాడుల్లో 50,647 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. ఇందులో 26,488 మెట్రిక్ టన్నుల బియ్యం కెర్నెల్స్ కలిగిన పోర్టిఫైడ్‌గా గుర్తించారు. 13 గొడౌన్ల యజమానులపై 6(ఎ) కేసులు నమోదు చేశారు. తాజాగా పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. గత ఐదేళ్లలో రూ.800కోట్ల పీడీఎస్ బియ్యం ఇతర దేశాలకు ఎగుమతి అయినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పీడీఎస్ బియ్యం సేకరణ ఎలా జరిగిందనే అంశంపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. పైగా కాకినాడ యాంకరేజ్ పోర్టు, డీప్ వాటర్ పోర్టు, కుంభాభిషేకం వంటి ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటుపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. పీడీఎస్ బియ్యం రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు అవుతున్నాయి. ఈ విషయమై కాకినాడ పోర్టు సీఐ సుమంత్‌ను సంప్రదించగా... పీడీఎస్ బియ్యం కలిగిన గొడౌన్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఏజెన్సీ సమాచారం

మాతాశిశు మరణాలు తగ్గాయి

ఆర్జేడీ చిన్మయిదేవి



అంగన్వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న చిన్మయిదేవి

రాజవొమ్మంగి, జూలై 25: గతంతో పోలిస్తే శిశు మరణాలు చాలా వరకు తగ్గాయని ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి పేర్కొన్నారు. గురువారం ఆమె మండలంలోని శరభవరం, శాంతినగర్ అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆర్జేడీ రాజవొమ్మంగి ఐసీడీఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తాను తనిఖీ చేసిన కేంద్రాలు చాలా బాగున్నాయన్నారు. తాను అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు ఆర్జేడీగా వ్యవహరిస్తున్నానన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 68 ప్రాజెక్టుల్లో 13,613 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇందులో సుమారు మూడు వేలు అద్దె భవనాల్లో, 600 భవనాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడమే కాకుండా అంగ న్వాడీ వర్కర్లు నిరంతరం వారిని పర్యవేక్షించాలన్నారు. వర్కర్లు సమయానికి కేంద్రం తెరవకపోయినా, కేంద్రంలో లేకపోయినా ఉపేక్షించవద్దని... రూల్ ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని సూపర్వైజర్లకు సూచించారు. కేంద్రానికి పిల్లలు వచ్చి తిరిగి ఇళ్లకు వెళ్లే వరకు వారి పూర్తి బాధ్యత కార్యకర్తలదేనన్నారు. సూపర్వైజర్లు, సీడీపీవో నిరంతరం కేంద్రాలను తనిఖీ చేయడంతో పాటు టూర్ డైరీ మెయింటైన్ చేయలన్నారు. శాంతినగర్ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పెడుతున్న పౌష్టికాహారాన్ని ఆర్జేడీ పరిశీలించారు. పిల్లలు ఎత్తు, బరువు చూసి గతంలో నమోదు చేసిన కొలతలకు వ్యత్యాసం చూశారు. ఐసీడీఎస్ యూడీసీ సత్యకుమారి, సూపర్వైజర్లు అరుణలత, నాగజయలక్ష్మి, అమ్మాజీ, అమ్మిరాజు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బొజ్జిరెడ్డి

రాకోటలో శాగంటి రాజారావు వర్ధంతి

రంపచోడవరం, జూలై 25: మండలంలోని రాకోట గ్రామంలో ఆదివాసీ ప్రాంతాల ప్రతిఘటన పోరాట యోధుడు శాగంటి రాజారావు 3వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బచ్చల బొజ్జిరెడ్డి మాట్లాడుతూ రాజారావు పీడిత ప్రజల నాయకుడిగా... పోడు భూములకు పట్టాలు, కార్మికులకు కనీస వేతన చట్టాలు అమలు, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ పోరాటాలు చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు కత్తుల సోమిరెడ్డి, పీవోడబ్ల్యు నాయకురాలు బి.శ్రీదేవి, కె.పాపారావురెడ్డి, కె.రత్నారెడ్డి, సాదల గణపతిరెడ్డి, ఎస్.రత్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న జమాల్ఖాన్

వరద బాధితులకు అండగా ఉంటా

కూనవరం, జూలై 25: వరద బాధితులకు అండగా ఉంటానని టీడీపీ నాయకులు, జేకే ట్రస్టు చైర్మన్ జమాల్ఖాన్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలో పర్యటించారు. 2022, 2023 వరదల చేసిన సాయంలానే మళ్లీ సాయం చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం ఆదుకుందన్నారు. సీఎం చంద్రబాబు వరదలపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారని, ప్రతి ముంపు మండలానికి ఒక ఐఏఎస్ అధికారిని నియమించారని తెలిపారు. పర్యటనలో టీడీపీ అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, నాయకులు చెలికాని ఉమామహేశ్వరరావు, సుఫీ పాల్గొన్నారు.



కూనవరంలో బ్లీచింగ్ చల్లిస్తున్న ఈవో సురేష్

అధికారుల పనితీరు భేష్

నిర్వాసితుల ప్రశంసల జల్లు

కూనవరం, జూలై 25: వరదల సమయంలో అధికారుల పనితీరుపై బాధితులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. పునరావాసం, నిర్వాసితులను దాటించేందుకు పడవలు ఏర్పాటు చేయడం, నిత్యావసర వస్తువులు అందించడంలో ప్రభుత్వం, అధికారులు ఎక్కడా రాజీపడలేదు. కలెక్టర్ నుంచి కింది స్థాయి వరకు అధికారులంతా ప్రజలకు 24 గంటలూ సేవలందించారు. రాత్రివేళల్లో సైతం అధికారులు అండగా ఉండి వారి మన్ననలు పొందారు. ట్రాక్టర్ల ద్వారా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. రోడ్లపై నీరు చేరడంతో ఎక్కడికక్కడ పడవలు ఏర్పాటు చేసి ప్రజలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. పునరావాస కేంద్రాల్లోను, ముంపు పట్టని గ్రామాల్లో సైతం హెల్త్ క్యాంపులు నిర్వహించారు. 108 వాహనాలను అదనంగా దిగుమతి చేశారు. వరదల సమయంలో గర్భిణులకు ప్రత్యేక సేవలందించారు. కోతులగుట్ట ప్రభుత్వాస్పత్రిలో గురువారం తొలి సిజేరియన్ ఆపరేషన్ చేశారు. బాధితులు చీకట్లో మగ్గకుండా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. గోదావరి వరద నీటిమట్టం 50 అడుగులు దాటినా విద్యుత్ సరఫరా చేశారు. తమకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించారని వరద బాధితులు అధికారులకు జేజేలు పలుకుతున్నారు.

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరు-1 ఏనుగులగూడెంఅగ్రహారం ఆర్ అండ్ఆర్ కాలనీలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఎక్కడికక్కడ బ్లీచింగ్ చల్లి గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మునుసగుంట పరిధిలోని మూలపాడు, గానుగలగుంది ఆర్అండ్ఆర్ కాలనీల్లో శుక్రవారం పారిశుధ్య నిర్వహణ చేస్తామన్నారు.

నాటు పడవలు నడపొద్దు : సీఐ గోపాలరావు

మోతుగూడెం, జూలై 25: వరదల కారణంగా నాటు పడవలు నడపొద్దని మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు కోరారు. పది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, డొంకరాయి రిజర్వాయరు నుంచి 2200 క్యూసెక్కుల నీటిని వదిలేశారన్నారు. కింద ఉన్న గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. పొల్లూరు, కొత్తపల్లి, మోతుగూడెం రేవుల్లో నాటు పడవలను నడపొద్దని అప్రమత్తం చేశారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ

పాఠశాలలకే పరిమితం చేయాలి

దివాన్చెరువు, జూలై 25: తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే పరిమితం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సూరి జయత్రినాథబాబు ప్రభుత్వానికి సూచించారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ పథకం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెంది ప్రభుత్వ పాఠశాలలో చదివే వారికి మాత్రమే పరిమితం చేస్తూ మార్గదర్శకాలు రూపొందిస్తే బాగుంటుందని, ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తంచేశారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



కడియం ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

» విద్యాశాఖాధికారులకు యూటీఎఫ్ నాయకుల వినతి

కడియం, జూలై 25: పాఠశాలల్లో నెలకొన్న విద్యాసమస్యలన్నింటినీ పరిష్కరించాలని యూటీఎఫ్ మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.అబ్బాయి, వి.శాస్త్రి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కోశాధికారి ఈవీవీఎస్ఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవోలు మణికుమార్, వై.నాగేశ్వరరావులకు వినతిపత్రం అందించారు. జీవో 117ను రద్దు చేసి జీవో 55 ప్రకారం టీచర్లను కేటాయించాలని, ప్రీప్రైమరీతో పాటు 1 నుంచి 5 వతరగతి వరకు ఒకే పాఠశాలగా నడపాలన్నారు. రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానం అమలు చేయాలని, హైస్కూల్లో రెండు మీడియంల్లో సమాంతరంగా బోధన నిర్వహించాలన్నారు. హైస్కూళ్లలో నాన్టీచింగ్ సిబ్బందిని నియమించాలని, గిరిజన ప్రాంతాల్లో ప్లస్టూ స్కూళ్లను ఏర్పాటు చేయాలని, మోడల్ స్కూల్ టీచర్స్ సర్వీస్ రూల్స్ను విడుదల చేయాలని కోరారు. కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్యనియామకాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వనజ, స్వర్ణకుమారి, సీహెచ్ భద్రరావు, ఆనంద విజయ్కుమార్, నాగేశ్వరరావు, ఫణికుమార్, దొంతంశెట్టి భద్రరావు పాల్గొన్నారు.

కోరుకొండ: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ మండలంలోని యూటీఎఫ్ నాయకులు తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో హేమసుందరరావుకు, ఎంఈవో టి.కుశలవదొరకు వినతిపత్రాలు అందజేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్యక్షుడు శివబాబు, రాజేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

'శిక్షా సప్తాహ్'తో వినోదంతో పాటు విజ్ఞానం

» రాజానగరం ఎంఈవో జ్యోతిప్రసాద్

» పలు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

దివాన్చెరువు, జూలై 25: విద్యార్థులకు వినోదంతో బాటు విజ్ఞానం పెంపొందించే విధంగా శిక్షాసప్తాహ్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో-2 జ్యోతిప్రసాద్ అన్నారు. శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజైన గురువారం సంపత్నగరంలోని జడ్పీ హైస్కూల్లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. చదువుతోబాటు సాంస్కృతిక కార్యక్రమాలను అలవర్చుకోవాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు చూపిన ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిక్కవోలు: ఊలపల్లి జడ్పీ హైస్కూలో విద్యార్థినులతో వివిద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పందలపాక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వందేమాతరం, మేమే ఇండియన్స్, సోదమ్మ సోది అంటూ అనేక సాంస్కృతిక స్కిట్లు ప్రదర్శించారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోణాల సత్తిరాజు, పీడీ యువరాజారెడ్డి పాల్గొన్నారు.



బిక్కవోలు: ఊలపల్లి జడ్పీ హైస్కూల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కడియం: కడియం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సత్యనారాయణ జరిగిన కార్యక్రమంలో ఎంఈవో వై.నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు ఆల్రౌండ్ ప్రతిభ కలిగి ఉండాలన్నారు. ఎంఈవో-2 ఎంఎస్ మణికుమార్ మాట్లాడుతూ కడియం పిల్లలు రాష్ట్ర స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుంటారని అభినందించారు. తన అభినయంతో ఆకట్టుకున్న విద్యార్థులు శరణ్య, మోహన పవిత్రను, పాటలు పాడిన షిరిన్ సిస్టర్స్ను అభినందించారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ దుర్యోధనుని ఏకపాత్రాభినయం, తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ జానపద గేయం ఆలపించారు. చిన్నారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు.

భిన్నత్వంలో ఏకత్వం పెంచాలి : డీఐ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25: విద్యార్థి దశ నుంచే భిన్నత్వంలో ఏకత్వం పెంచాల్సిన అవసరం ఉందని రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్కుమార్ అన్నారు. స్థానిక ఎస్కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, సీఆర్పీ జయంతి శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఢిల్లీలో జగన్ ధర్నా అట్టర్ ప్లాప్

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, జూలై 25: దేశరాజధాని ఢిల్లీలో జగన్ చేసిన ధర్నా అట్టర్ ప్లాప్ అయ్యిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. కంబాలచెరువు వద్ద తన కార్యాలయంలో గురువారం విలేకరుల తో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన జగన్ ఆత్మపరిశీలన చేసుకోకుండా ఎలాగోలా రాష్ట్రాన్ని ఇరుకులో పెట్టాలనే కుట్ర చేస్తున్నాడని మండిపడ్డారు. గత వైసీపీ ఐదేళ్ల కాలంలో 2686 హత్యలు జరిగితే కనీసం స్పందించలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కేవలం 30 రోజుల్లో 30 మంది హత్య చేయ్యబడ్డారని చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ఆ 30 మంది ఎవరెవరో చెప్పమని ఢిల్లీలో జాతీయ మీడియా ప్రశ్నిస్తే నీళ్లు నమిలాడన్నారు. ఓటమిని అంగీకరించలేక అసత్యాలు పలికి ప్రజలు మోసంచేసే ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కంటిపూడి శ్రీనివాస్, మళ్ళ వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్కే వైసీపీలో సభ్యత్వం లేదు

టీకే విశ్వేశ్వరరెడ్డి

అతని ధోరణి చూడలేకనే కాంగ్రెస్లోకి చేరా

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25: వైసీపీలో మాజీ సీఎం జగన్ కే సభ్యత్వం లేదని ఆ పార్టీ నుంచి కాంగ్రెస్లోకి వచ్చిన టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం పేపరుమిల్లు ఎదురుగా ఉన్న కృష్ణసాయి కల్యాణ మండపంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్ఆర్ మరణించాక తండ్రి ఆశయాల ప్రకారం పనిచేస్తాడని తాను ఆనాడు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలోకి చేరానని చెప్పారు. కానీ జగన్ కేవలం సీఎం పదవికోసమే చూశాడని పార్టీలో ప్రజావ్యతిరేక విధానాలనే అవలంబించాడన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చాక కనీసం సభ్యత నమోదు ప్రక్రియ నిర్వహించలేదన్నారు. ఆ పార్టీలో కార్యకర్తలను కనీసం మనుషులుగా కూడా చూడరన్నారు. అది తట్టుకోలేకే తాను ఈనెల 23న విజయవాడలో షర్మిలరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరానని చెప్పారు. వైఎస్ షర్మిళారెడ్డి న్యాయకత్వంలో పార్టీని మరింతగా బలోపేతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బోడా వెంకట్, మార్టిన్ లూథర్, బాలేపల్లి మురళీధర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కిషోర్ జైన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మోతా శారద, సీతానగరం, కోరు కొండ మండల అధ్యక్షులు నల్లా వీర్రాజు, దోసపాటి సత్యప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ సాయి తదితరులు పాల్గొన్నారు.

28న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డికి సత్కారం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేగా గెలిచిన ఆదిరెడ్డి శ్రీనివాస్ల సత్కార సభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు కాపు సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు రామినీడి మురళీ తెలిపారు. రాజమండ్రి ప్రెస్క్లబ్లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హోటల్ ఆనంద్ రీజెన్సీలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు సత్కార సభ ఉంటుందన్నారు. సత్కారోత్సవానికి పార్టీలకతీ తంగా కాపులంతా విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు అల్లూరి శేషునారాయణరావు, దొండపాటి సత్యంబాబు, చింతం వీరబాబు, మీసాల నాగు పాల్గొన్నారు.

రంపచోడవరం జిల్లాకు

తమ్మనదొర పేరుపెట్టాలి : ఆదివాసీ మహాసభ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25 : బ్రిటీష వారితో పోరాడిన తొలి గిరిజన వీరుడు కారం తమ్మనదొర పేరును రంపచోడవరం జిల్లాకు పెట్టాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్క్లబ్లో కారం తమ్మన్నదొర 145వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలైన సందర్భంగా జరిగిన ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా కారం తమ్మన్నదొర చరిత్ర వెలుగులోకి వచ్చిందన్నారు. సమావేశంలో ఆదివాసి మహాసభ ప్రతినిధులు అరగంటి వీరభద్రారెడ్డి, గిడుతూరి చిన్నారావు, కెచ్చెల అబ్బాయిరెడ్డి, కారం శ్రీనివాసు దొర, జక్కల పాండవులు, కారం చిన్నపోతురాజు, మడి అప్పన్నదొర, కారం చిట్టెమ్మ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో 446 మంది

రాజమహేంద్రవరం మునిసిపల్ అదనపు కమిషనర్ సత్యవేణి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25: రాజమహేంద్రవరంలో ఆల్కాట్ గార్డెన్స్, చందా సత్రంలలో ఏర్పాటు చేసిన వరద బాధితుల పునరావాస కేంద్రాలు కొనసాగుతాయని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి తెలిపారు. ప్రజలకు ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. మునిసిపల్ కల్యాణ మండపంలో 248 మందికి, చందాసత్రంలో 198 మందికి సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

నర్సాపురం ఎంపీడీవో మృతికి సంతాపం

గోకవరం, జూలై 25: పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణారావు ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమని గోకవరం ఎంపీడీవో గోవింద అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సంతాప సభలో ఎంపీడీవోతో పాటు కార్యాలయ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. పాల్గొన్నారు. వెంకటరమణారావు గోకవరం ఎంపీడీవోగా 2014లో ఆరు నెలలు పాటు పనిచేసి ప్రజల మన్ననలు పొందగలిగారన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో ప్రసాద్, పంచాయతీ విస్తరణాధికారి రాజేశ్వరరావు, పంచాయితీరాజ్ జేఈ అబ్బాయిదొర తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోకవరం, జూలై 25: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం ఈ నెల 26న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్కో ఏఈ (ఆపరేషన్) దాట్ల శ్రీధర్వర్మ గురువారం తెలిపారు.కొత్తపల్లి, కామరాజుపేట, గంగంపాలెం, రాకూరుపాలెం, సూదికొండ, జగన్నాధపురం, శివరామపట్నం, భూపతిపాలెం, మల్లవరం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

అనపర్తి: అనపర్తి, పీరా రామచంద్రపురం సబ్స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం అనపర్తిలోని జీబీఆర్ కళాశాల ఏరియా, ఇందిరానగర్, సునందపేట, మార్కెండేయపురం, మార్కెట్, శేషగిరావుపేట, వెంకటరత్నపురం, మెయిన్ రోడ్డు, కెనాల్ రోడ్డు, కొప్పవరం, మహేంద్రవాడ, లక్ష్మీనరసాపురం, పీరా రామచంద్రపురం, దుప్పలపూడి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ దాట్ల శ్రీధర్వర్మ తెలిపారు.

కమిషనర్ కేతన్ను కలిసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25: రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్గా బాధ్యతలు స్వీకరించిన కేతన్ గర్గ్ను మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. నగరంలో పలు అంశాలపై కమిషనర్తో చర్చించారు. కార్యక్రమంలో ఛాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, దుత్తరపు గంగాధర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 25: రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో ఆవరణలో ఐదుగురు డ్రైవర్లు, నలుగురు కండక్టర్లు ప్రతిభ కనబరి చారని డిపో మేనేజరు ఎస్కే షబ్నం గురువారం తెలిపారు. డిపో ఆవ రణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులిచ్చి సత్కరించారు. కండక్టర్లు ఎస్యు నందిని, కె.పద్మ, వీవీవీ.చిరంజీవి, ఆర్ఎస్.నారాయణ, ఆర్బీపీ.రెడ్డి, సిహెచ్ఎస్.రావులకు, డ్రైవర్లు పీఎస్.వాసు, ఈఎస్.నారాయణ, ఎన్వీజీ కృష్ణలకు, గ్యారేజీ సిబ్బంది ఎస్.వెంకటేష్, ఏ.సాయిబాబాలను సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు ఎం.అజయ్బాబు, ఏఈ ఎం.ఈశ్వరరావు, బస్ స్టేషన్ మేనేజరు డి.త్రిమూర్తులు, ట్రాఫిక్, గ్యారేజీ, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అరాచకాలపై చర్యలు చేపట్టండి

డీజీపీని కోరిన ఎమ్మెల్యే నల్లమిల్లి



అనపర్తి, జూలై 25: గత ప్రభుత్వం హయాంలో అనపర్తి నియోజకవర్గంలో పోలీసులు చేసిన అరాచకాలపై చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. గురువారం మంగళగిరిలోని కార్యాలయంలో డీజీపీని కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో శాంతి భద్రతలు, గత ప్రభుత్వ హయాంలో పోలీసులు వ్యవహరించిన తీరుపైన వివరించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి వెంట బీజేపీ స్టేట్ మీడియా ఇన్చార్జి పాతూరి నాగభూషణం ఉన్నారు.

కోలమూరులో భేటీ బచావో.. భేటీ పడావో

రాజమహేంద్రవరం రూరల్, జూలై 25: మండలంలోని కోలమూరు జడ్పీ హైస్కూల్లో గురువారం భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ కోలమూరు సెక్టార్ సూపర్వైజరు వి.మేరీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ సీహెచ్ అభిషోలోములు బాలల హక్కులు, బాల్యవివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం-2012, అక్రమ రవాణా చట్టం-1956, గర్భస్థ శిశువు లింగనిర్ధారణ చట్టం-1994 గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

30న కన్నమాంబ జాతరకు పటిష్ట బందోబస్తు : డీఎస్పీ

రాజమహేంద్రవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇన్నీస్పేట రెడ్డిల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహించనున్న కన్నమాంబ తల్లి జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని సౌత్జోన్ డీఎస్పీ అంబికాప్రసాద్ వెల్లడించారు. ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాలతో ఉత్సవ కమిటీతో ఆయన గురువారం రాత్రి సమావేశం నిర్వహించారు. జాతర మహో త్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని.. ఎలాంటి అసాంఘిక, అవాంఛనీయ సంఘటనలకూ తావు లేకుండా చర్యలు తీసుకోవాలని కమిటీకి సూచించారు. ఏదైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. కమిటీ అభ్యర్థన మేరకు ట్రాఫిక్ నియంత్రిస్తామన్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ వి.శ్రీనివాస్, ఎస్ఐలు బి.వినోద్, పీవీ రత్తయ్య, ఉత్సవ కమిటీ పెద్దలు బొదిరెడ్డ అప్పారావు, కల్లి అప్పలరెడ్డి, ధర్మాల రమణ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన 'ఆర్యాపురం' ప్యానల్



చంద్రబాబును కలిసి సత్కరిస్తున్న ఆర్యాంపురం బ్యాంక్ పాలక మండలి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25: ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్యానల్ను సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరిచయం చేశారు. గురువారం అసెంబ్లీ సమావేశాలు అయ్యాక విజయవాడలో చంద్రబాబు చాంబర్లో ఆయన్ను బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, డైరెక్టర్లు యెనుముల రంగబాబు, పొలాకి పరమేష్, శ్రీనివాస్ (పెదకాపు), శ్యామ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి పరిచయం చేశారు. కూటమి ప్యానల్ను విజయం పట్ల ఆయనను చంద్రబాబు అభినందించారు. ప్యానల్కు శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంక్ను అభివృద్ధి పథంలో నడింపించాలని చైర్మన్ చల్లాకు సూచించారు.

విమానాశ్రయం ముంపు నీరు పరిశీలన

కోరుకొండ, జూలై 25: మధురపూడి విమానాశ్రయం వద్ద నిలిచిపోయిన ముంపునీటిని ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి గురువారం పరిశీలించారు. అధిక వర్షాలు కురిసినప్పుడు నీరు విమానాశ్రయం నుంచి మధురుపూడి గ్రామ పరిధిలోని నల్లా చెరువులకు వెళ్లవలిసి ఉందని, ఆ సమయంలో నల్లా చెరువు చుట్టు పక్కల పొలాలు ముంపునకు గురవుతాయన్న భయంతో రైతులు పూడ్చి వేశారని, అందువల్ల విమానాశ్రయంలోని వరదనీరు బయటకు పోయే మార్గంలేక ఎయిర్పోర్టులోనిలిచిపోవడంతో ముంపు గోదావరిలా మారిందని అధికారులు ఆమెకు వివరించారు. ఈ మొత్తం పరిస్థితిని ఆర్డీవో పరిశీలించారు. ఆమె వెంట తహశీల్దార్ డి.రాజ్యలక్ష్మి, డీటీ ఎస్వీ నరేష్, ఇరిగేషన్ అధికారులున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బిక్కవోలు, జూలై 25: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కూటమి నాయకుడు నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి సూచించారు. బలభద్రపురంలో గురువారం ఆయన ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చిన కొబ్బరి మొక్కలను గ్రామంలోని పెద కాలువకు ఇరువైపులా నాటారు. కార్యక్రమంలో మల్లిడి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ చిన్నం రాఘవరెడ్డి, దత్తుడు సుబ్బారెడ్డి, అనపర్తి, మండపేట వెలమ సంఘ యూత్ అధ్యక్షుడు సలుమూరి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

బిక్కవోలు, జూలై 25: ఊలపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల కృష్ణ (63) ఈ నెల 19 నుంచి కనబడడం లేదని ఆయన బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.బుజ్జిబాబు గురువారం తెలిపారు. అతడి ఆచూకీ తెలిసిన వారు బిక్కవోలు పోలీస్స్టేషన్కు లేదా 94409 04851 నెంబరుకు ఫోన్ చేసి తెలియపర్చాలని ఆయన సూచించారు.

ఆవ భూముల అవకతవకలపై

సీబీఐ దర్యాప్తు జరిపించండి

బీజేపీ ఇన్చార్జ్ నీరుకొండ



కోరుకొండ, జూలై 25: గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చే ముసుగులో మండలంలోని బూరుగుపూడి ఆవభూముల కొనుగోలులో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయని, వాటిపై ప్రభుత్వం సీబీఐతో సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం కోరుకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆవ భూముల్లో నెలల తరబడి సుమారు 10అడుగుల లోతున నీరు నిలిచి ఉంటుందని, అలాంటి భూములకు రూ.40 లక్షలు చెల్లించి 25వేల మంది పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని కొనుగోలు చేశారన్నారు. సుమారు 300 ఎకరాల్లో అప్పటి ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇచ్చిందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలు వందల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయన్నారు. ఆ భూములు ఇళ్ల నిర్మాణానికి పనికిరావని పలు సంస్థలు నివేదికలు ఇచ్చాయని, హై కోర్టు కూడా ఆవభూముల్లో ఇళ్ల కేటాయింపుపై అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. దీనిపై ప్రస్తుత శాసన సభ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం సమగ్రంగా చర్చించాలని, సీబీఐతో సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్, పలువురు ప్రభుత్వ పెద్దలను కోరారు.

బడ్జెట్లో ఏపీకి అన్యాయం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 25: సామాన్యులకు భారాలు, సంపన్నులకు వరాలు మాదిరిగా కేంద్ర బడ్జెట్ ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ విమర్శించారు. స్థానిక శ్యామల సెంటర్లో గురువారం కేంద్రబడ్జెట్కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కంటితుడుపు చర్యగానే ఉందన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేశారని విమర్శించారు.

ఎస్పీని కలిసిన డాక్టర్ గోరంట్ల రవికిరణ్

రాజమహేంద్రవరం రూరల్, జూలై 25: టీడీపీ యువ నాయకుడు డాక్టర్ గోరంట్ల రవిరామ్కిరణ్ జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ను మర్యాదపూర్వకంగా కలిసారు. గురువారం ఎస్పి కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట టీడీపీ నాయకులు మచ్చేటి ప్రసాద్ తదితరులున్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: రాయన్
సూర్యామినీ	: డెడ్పూల్ అండ్ వోల్వరిన్
సూర్యాప్యాలస్	: రాయన్
స్వామి	: డెడ్పూల్ అండ్ వోల్వరిన్
శివజ్యోతి	: డెడ్పూల్ అండ్ వోల్వరిన్
అనుశ్రీ(సాయికృష్ణ)	: డార్లింగ్
రాజా	: -----
ఊర్వశి	: భారతీయుడు-2
రంభ	: పురుషోత్తముడు
మేనక	: డెడ్పూల్ అండ్ వోల్వరిన్
అప్సర	: డెడ్పూల్ అండ్ వోల్వరిన్
కుమారి	: ఆపరేషన్ రావణ్
అశోక	: కల్కి
వీఎస్ మహాల్(నామవరం)	: రాయన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కల్కి
వెంకటసూర్య(కడియం)	: రాయన్
సత్యగౌరి (అనపర్తి)	: భారతీయుడు-2
సూర్యశ్రీ (అనపర్తి)	: ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: రాయన్
రామకృష్ణ(కోరుకొండ)	: భారతీయుడు-2
గీతాసినిమాస్ (సీతానగరం)	: రాయన్
శ్రీనివాస (గోకవరం)	: రాయన్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ---
లలితామహల్(రంపచోడవరం)	: రాయన్
నవయుగ(చింతూరు)	: -----

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 26 జూలై 2024 | 5



రూ.5 లక్షల్లోపు పనులు తక్షణం చేపట్టండి

- జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి
- ఆర్‌డబ్ల్యూఎస్ సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూలై25(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రూ.5లక్షల లోపు విలువైన జలజీవన్ మిషన్ పనులన్నీ తక్షణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె జలజీవన్ మిషన్ పనులపై పురోగతిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న జలజీవన్ మిషన్ పథకం పనులు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.489 కోట్లతో చేపట్టిన 670 పనుల్లో 355 పూర్తయ్యాయని 84 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మిగతావాటిని కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.గ్రామీణ ఉపాధి పథకం కింద జిల్లాలో రూ.19.29 కోట్లతో చేపట్టిన 243 డ్రైన్ల నిర్మాణ పనుల్లో 25 పూర్తయ్యాయని,46 పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన పనుల లక్ష్య సాధన పూర్తయ్యేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. సచివాలయాల పరిధిలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సుల(సీఎస్‌సీ) కింద 11.76 కోట్లతో చేపట్టిన 392 పనులకు 331 పనులు పూర్తికాగా, 49 పురోగతిలో ఉన్నాయన్నారు. జీజీఎంపీ కింద రూ.43.58 కోట్లతో 1263 పనులు చేపట్టగా 820 పూర్తయ్యాయని ఇంకా 26 పురోగతిలో ఉన్నాయన్నారు.ఆమోదించిన పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ప్రతిపాదించిన పనుల్లో రూ. 5లక్షల లోపు పనులన్నీ తక్షణం చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, రాజమండ్రి, అనపర్తి, కొవ్వూరు డివిజన్ల డీఈలు టి.శ్రీనివాసబాబు, ఎస్.రవికుమార్, ఎన్.అప్పారావు, డీఎల్‌డీవో వీణాదేవి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం నా డ్రీమ్ సిటీ

కమిషనర్‌గా కేతన్ గర్గ్ బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25 : చారిత్రక రాజమహేంద్రవరం నా డ్రీమ్ సిటీ.. ఇక్కడికి ఎంతో ఇష్టంతో వచ్చానని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గర్గ్ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ గా గురువారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. తొలుత వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు చేయగా కొబ్బరికాయ కొట్టి కార్యాలయంలోకి ప్రవేశించారు. రాజస్థాన్‌కు చెంది కేతన్ గర్గ్ 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ఐఆర్‌ఎస్ అధికారి, ఇన్‌కంట్యాక్స్ అధికారి, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, రాజస్థాన్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా ఏడు విభిన్నమైన ఉద్యోగాలు చేశారు. తండ్రి కేదారినాథ్ రిటైర్డ్ డాక్టర్, తల్లి మిథిలేషి గర్గ్ గృహిణి. తల్లి కోరిక మేరక ఐఏఎస్ చేశారు. 2019 -20లో సహాయ ట్రైనీ కలెక్టర్‌గా విజయనగరం జిల్లాలో పనిచేశారు. 2020 ఆగస్టు 10 నుంచి 2022 జనవరి 24 వరకు రాజంపేట సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. 2022 ఏప్రిల్ 4 నుంచి 2024 జూలై 22 వరకు అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇప్పుడు రాజమహేంద్రవరం కమిషనర్‌గా నియమితులయ్యారు. కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ గోదావరి వరద పనులపై దృష్టి పెడతానని..అటుపై నగరంలో సమస్యలు, అభివృద్ధి పనులపై దృష్టి పెడతామన్నారు.అనంతరం కమిషనర్ కేతన్ గర్గ్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీఎం.సత్యవేణి, సిటీప్లానర్ జీవీఎస్ఎన్.మూర్తి ఎస్ఈ పాండురంగారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఎస్ఎస్ ఇంద్రగంటి శ్రీనివాసరావు, మేనేజరు మాలిక్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు చాపల శ్రీనివాసరావు తదితరులు పుష్పగుచ్ఛం అందించారు.



కలెక్టర్ ప్రశాంతికి మొక్కను అందజేస్తున్న కమిషనర్ కేతన్ గర్గ్

ఉపాధి పనికొస్తే రూ.300 ఇవ్వాలి

మెటీరియల్ కాంపోనెంట్ రూ. 45 కోట్లు మంజూరు



రాజమహేంద్రవరం సిటీ, జూలై 25 : జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ప్రగతి లక్ష్యాలపై ఆమె సమీక్షించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 30 లక్షల పనిదినాలు కల్పించి రూ.66.7 కోట్ల చెల్లింపులు జరిపినట్టు తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ వేతనదారులకు సగటున వేతనం రూ.300లు చెల్లింపులు జరిగే దిశగా అధికారులు ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీల వేతన లక్ష్యసాధనలో భాగంగా మెటీరియల్ కాంపొనెంట్‌గా రూ.45 కోట్లు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా సీసీ రోడ్లు ,సిమెంట్ డ్రైన్లు గ్రామాల అభివృద్ధికి మరిన్ని పనులను ఈ నిధులతో చేపట్టాలన్నారు. సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ పీడీ ఎ .ముఖలింగం ,అసిస్టెంట్ పీడీ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద మెట్లు దిగువకు గోదావరి



కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద మెట్లపై ప్రవహిస్తున్న అఖండ గోదావరి

గోదావడిలో..

వరద తగ్గింది..బురద మిగిలింది..



- శాంతించిన గోదావరి
- ధవళేశ్వరం వద్ద తగ్గిన ఉధృతి
- రెండో హెచ్చరిక ఉపసంహరణ
- 13.40 అడుగులకు నీటిమట్టం
- దిగువకు 12.27 లక్షల క్యూసెక్కులు
- బురదతో నిండిన రేవులు
- ముంపులోనే వరి పొలాలు
- లంకల్లో వీడని ముంపు
- నష్టం అంచనాల్లో అధికారులు
- భద్రాచలంలో తగ్గుతున్న నీటిమట్టం

రాజమహేంద్రవరం,జూలై 25(ఆంధ్రజ్యోతి)/ కొవ్వూరు : గోదావరికి వరద పెరుగుతూ, తగ్గుతూ తీరప్రాంత ప్రజలతో దోబూచులాడుతుంది. నదీ పరీవాహక ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద ప్రవాహం అధికంగా నదిలో చేరుతుంది. దీంతో గడిచిన 48 గంటల్లో గోదావరికి ఎగువన భద్రాచలం వద్ద వరద ఉధృతి 51.60 అడుగుల నుంచి 44 అడుగులకు తగ్గినట్టే తగ్గి మరలా పెరుగుతుంది. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు 48.30 అడుగులకు మర లా వరద ప్రవాహం చేరుకుంది. గురువారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద 48.60 అడుగులకు చేరింది. గురువారం ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకూ నీటిమట్టం నిలకడగా ఉంది.ఈ పెరుగుదల స్వల్పంగానే ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి ఎగువన మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అక్కడక్కడా వర్షాలు పడుతుండడంతో వరద స్వల్పంగా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ధవళేశ్వరం ఇరిగేషన్ అధికారులు మాత్రం ఇక ఆగస్టు వరకూ గోదావరి తగ్గుతూ పెరుగుతూ ఇలాగే ఉంటుందని చెబుతున్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద తగ్గుముఖం పట్టడంతో గురువారం ఉదయం 9 గంటలకు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. మధ్యా హ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ బ్యారేజి నీటిమట్టం 13.40 అడుగులు నిలకడగా ఉంది.కానీ క్యూసెక్కుల్లో తేడా ఉంది. సాయంత్రం 6గంటలకు బ్యారేజీ నుంచి 12,30,242 క్యూసెక్కులు సముద్రంలోకి వెళ్లగా ఏడుగంటలకు 12,27,273 క్యూసెక్కులు వెళుతోంది. భద్రాచలం వద్ద పెరుగుతున్న వరద ధవళేశ్వరం చేరుకునే సరికి 18 గంటలు పడుతుంది.దీంతో భద్రాచలం వద్ద గోదావడి ఇలాగే కొనసాగితే ధవళేశ్వరం వద్ద వరద ప్రభావం పెద్దగా ఉండదని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. దీంతో గోష్పాదక్షేత్రంలోని ఆలయాలు ముంపు నుంచి తేరుకున్నాయి. షిర్డీసాయి బాబా ఆలయం చుట్టూ ఇంకా నీరు తగ్గలేదు.క్షేత్రానికి వచ్చే రెండు రహదారులపై వరద తగ్గుముఖం పట్టడంతో బురద పేరుకుపోయింది.బురదలో ఆదమరిచి వెళ్లామా జారి పడడం ఖాయం. క్షేత్రానికి వచ్చే యాత్రికులు,భక్తుల సౌకర్యార్థం వెంటనే శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.అయితే రాజ మహేంద్రవరం, కొవ్వూరులో ప్రధాన స్నానఘట్టాలు ముంపులోనే కొనసాగుతున్నాయి.వరద ఉధృతంగా ఉండ డంతో ప్రజలెవరూ నదిలో దిగకుండా పికెటింగ్‌లు కొనసాగిస్తున్నారు.ప్రస్తుత వరదతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఎటువంటి ప్రమాదం లేదని ఏజీఆర్‌బీ అధికారులు చెబుతున్నారు.

ఎర్రకాలువ ముంపు పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి : కలెక్టర్

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఎర్రకాలువ ముంపు నుంచి శాశ్వత పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఇరిగేషన్ అధికార్లను ఆదేశించారు.స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎర్రకాలువ ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు.ఎర్రకాల్వ సమస్యను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లనున్నారని తెలిపారు.ప్రతి ఏడాది ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలకు ఎర్రకాల్వకు వరద పోటెత్తడంతో జిల్లా లోని నల్లజర్ల, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం తదితర మండలాల్లోని పంటలకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. దీంతో పాటు రహదారులు ఛిద్రమైపోతున్నాయన్నారు. ఈ మేరకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏలూరు ఇరిగేషన్ ఎస్ఈ సిహెచ్.దేవ ప్రకాశరావును ఆదేశించారు. జంగారెడ్డిగూడెం కొంగువారిగూడెం వద్ద ఎర్రకాలువ ప్రాజెక్టు 4.42 టీఎంసీల కెపాసిటీతో ఉందన్నారు. అధిక వర్షాల వల్ల 17 వేల క్యూసెక్కుల నీటిని వదిలేయడంతో కింది ప్రాంతాల్లో సమస్య ఏర్ప డుతుందని చెప్పారు.తాడిపూడి ఎత్తిపోతల పథకం పరిధిలో భారీ వర్షాల వల్ల గట్టు తెగిపోయి ఇబ్బందులు వస్తున్నాయని నిధులు మంజూరు చేయాలని తాడి పూ డి డీఈ పి.బాలకృష్ణ కలెక్టర్‌ను కోరారు. ప్రతిపాద నలు సిద్ధం చేసి ఇవ్వాలని నిధులు విడుదల చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.సమావేశంలో ఇరిగేషన్ డీఈ కె.రవీంద్ర బాబు, తాడిపూడి డీఈ పి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొట్టుకుపోయిన కాజ్‌వే

నల్లజర్ల,జూలై 25 : ఎర్రకాల్వ వరద ఉధృతికి 30 ఏళ్ల కిందట టీడీపీ హయాంలో నిర్మించిన కాజ్‌వే బ్రిడ్జి కొట్టుకుపోయింది.దీంతో పుల్లలపాడు,మారెళ్ళమూడి,ఆవపాడు,సింగరాజుపాలెం గ్రామా రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.నిన్నటి వరకు నీరు ప్రవాహించడంతో బ్రిడ్జి కింద తూరలు ఉన్నాయని రైతులు అనుకు న్నారు.గురువారం ప్రవాహం తగ్గడంతో బ్రిడ్జితో పాటు తూరలు సైతం కొట్టుకుపోయి దర్శనమిస్తుంది.గతంలో పుల్లలపాడు ఊరచెరువు నిండితే వీరమ్మ చెరువులోకి నీరు వెళ్లేలా పుల్లపాడు,మారెళ్ళమూడి గ్రామాల మధ్య కాజ్‌వే బ్రిడ్జి నిర్మించారు.మొన్నటి వరకు రైతులు ఆ దారి వెంట వెళ్లి వ్యవసాయ పనులు చేసుకునే వారు. వరదల ఉధృతి ఎక్కువగా ఉండడంతో పుల్లలపాడు రైతులు నల్లజర్ల మీదుగా మారెళ్ళమూడి వచ్చి పనులు చేసుకున్నారు.

10043 హెక్టార్లలో పంట నష్టం

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, ఎర్రకాలువ, కొవ్వాడ కాలువ, బురద కాలువల వరదల వల్ల జిల్లాలో వరిపంటకు నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 60,450 హెక్టార్లలో వరి నాట్లు వేయగా, 13,300 హెక్టార్లలో నాట్లు మునిగిపోయాయన్నారు. 10043 హెక్టార్లలో నాట్లు వేసి 40 రోజులకంటే ఎక్కువైన పంటకు నష్టం జరిగిందన్నారు. 3180 హెక్టార్లలో 40 కంటే తక్కువ రోజులైన పంటకు నష్టం వాటిల్లిందన్నారు. జిల్లాలోని 16 మండలాల్లోని 179 గ్రామాల పరిధిలో 15,259 మంది రైతులకు కష్టం కలిగిందన్నారు. మొక్కజొన్న,చెరకు, మినప పంట కూడా కొంత ఉందన్నారు. దీని కోసం 800 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని పేర్కొన్నారు.

మునిగిన లంకలు..

పెరవలి, జూలై 25 : గోదావరి వరదకు మండల పరిధిలో ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ఖండవల్లి, ముక్కామల గ్రామాల పరిధిలో లంక భూముల్లో నీరు చేరింది. గోదావరి వరద తగ్గినా ఇక్కడ మాత్రం వరద లాగలేదు. అరటి, కూరగాయలు, పామాయిల్‌తోటల్లోకి నీరు చేరింది. ఈ వరద నీటికి అరటి వంటి పంటలకు పెద్దగా నష్టం లేకపోయినప్పటికీ కూరగాయలు పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే గత రెండు రోజులుగా వర్షం కూడా లేకపోవడం తో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.



శాంతించిన ఎర్రకాల్వ

నల్లజర్ల,జూలై 25 : ఎర్ర కాల్వ నిలకడగా ప్రవాహిస్తోంది. దీంతో నిడదవోలు, నల్లజర్ల మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.మండలంలో పలు గ్రామాల్లో వరద ఉధృతికి పంట చేల గట్లుపై పెద్ద పెద్ద గండ్లు..ఇసుక తెన్నులు పేరుకుపోయి పంటను నష్టపోయారు.ఈ నేపథ్యంలో నష్ట పరిహారానికి రైతులు ఎదురు చూస్తున్నారు. నల్లజర్ల మండలంలో 1800 ఎకరాలు నీట మునిగినట్టు ప్రాథమిక అంచనా వేశారు.ప్రస్తుతం 1000 ఎకరాలు మాత్రమే నీట మునిగినట్లు గుర్తించామని ఏవో కమల్ రాజ్ పేర్కొన్నారు.ఎర్ర కాల్వ పొంగి ప్రవాహిస్తుందని అధికారులు ముందస్తుగానే అనంతపల్లి,గుండేపల్లి గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.అధికారులు బలవంతంగా రెండు రోజులు తీసుకుని వచ్చినప్పటికి తమ ఇళ్ళకు వరద నీరు రాలేని మా ఇళ్ళ వద్దే ఉంటామని చెప్పడంతో కలెక్టర్ సైతం వారిని రెండో రోజే ఇళ్లకు పంపించారు.



పెరవలి మండలం తీపర్రు వద్ద జారిన ఏటిగట్టు

ఏటిగట్టు భయపడేటట్టు!

- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ
- పటిష్టత పనులు గాలికి..ఏటిగట్ల పటిష్టత కరవు
- ఇష్టానుసారంగా తవ్వేసిన ర్యాంపులు
- రూ.150 కోట్లతో బ్యారేజీకి కూటమి ప్రతిపాదనలు

రాజమహేంద్రవరం- జూలై 25(ఆంధ్రజ్యోతి) : ఏటిగట్టు.. భయపడేటట్టు ఉంది. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉభయ గోదావరి జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతంలోని గోదావరి ఏటిగట్ల పటిష్టత లేకుండాపోయింది. గోదావరి కుడి ఎడమ గట్లు పొడవు 530 కిలోమీటర్లు. ధవళేశ్వరం బ్యారేజీ ఎగువన 80 కిలోమీటర్లు ఉండగా దిగువన కోనసీమ, తూర్పు, పశ్చిమ జిల్లాల పరిధిలో 450 కిలోమీటర్ల ఏటిగట్లు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గోదావరి జిల్లాలోని ఏటిగట్లు, ధవళేశ్వరం బ్యారేజితో పాటు అనేక అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు, లాకులను పట్టించుకునే నాథుడే లేకపోయాడు. 2014- 19 మధ్య టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించిన పనులను వైసీపీ పట్టించుకోలేదు. గోదావరి డెల్టా ఆధునికీకరణను గాలికొదిలేసింది. గోదా వరి అంటే కేవలం ఇసుక దోపిడీ కోసం వినియోగించుకున్నారు. ఇష్టానుసారం ర్యాంపులను తవ్వేశారు.. గట్లను గుల్ల చేసేశారు. అదే ఇప్పుడు ప్రమాదకరంగా మారింది. ఎక్కడైనా గట్టు తెగిందా 1986 రిపీట్ అయ్యే అవకాశం ఉంది. గతేడాది వరద ఇలానే భయపెట్టింది.. రికార్డు స్థాయికి పెరిగి తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. 2022 జూలైలో భారీ వరదలు వచ్చినపుడు అప్పటి సీఎం జగన్ రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ గెస్టహౌస్‌లో గోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమీక్ష చేశారు. ప్రతిపాదనలు సిద్ధంచేస్తే అక్టోబరు నుంచే పనులు ఆరంభించి 2023 వరదల సీజన్ నాటికి పటిష్టపరుద్దామని ప్రకటించి ప్రతిపాదనలు సిద్ధం చేయమన్నారు. కోనసీమలో పర్యటించి రూ.150 కోట్లు తక్షణం ఇస్తున్నానని గట్లను పటిష్టం చేయాలని ప్రకటించారు. అధికారులు రూ.1500 కోట్లతో ప్రతిపాదించి అప్పట్లో ప్రభుత్వానికి పంపించారు. అయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అది ప్రస్తుతం పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో గోదావరి గట్లు బలహీనంగా ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. అరికిరేవుల- కుమారదేవం, ఏజీఎల్‌బీలోని షిర్డీ సాయి గుడి వెనుక, కూళ్ల- సుందరపల్లి, రాజోలు, పీఐపీ ఫ్లడ్ బ్యాంక్ పనులు అత్యవసరంగా చేయవలసి ఉంది.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తాత్కాలిక పనులు కొన్ని చోట్ల అత్యవసరంగా మొదలు పెట్టింది.ధవళేశ్వరం బ్యారేజీని వైసీపీ నిర్లక్ష్యం చేసింది.బ్యారేజీ ఎక్విప్‌మెంట్‌ను ఎలానూ పట్టించుకోలేదు. కనీసం రోడ్డు వేయలేకపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం నారా చంద్రబాబునాయుడు ఈ బ్యారేజీ మీద దృష్టి కేంద్రీకరించారు. రూ.150 కోట్ల ప్రతిపాదనలతో ఇరిగేషన్ అధికారులు ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు. త్వరలో ఈ బ్యారేజికి మహర్దశ రానున్నది.



సీతానగరం మండలం బొబ్బిల్లంక వద్ద సిద్ధంగా ఉంచిన ఇసుక బస్తాలు



బురద మిగిలింది : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వరద తగ్గడంతో మిగిలిన బురద



నష్టమెంత : శింగవరంలో రైతులతో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



కష్టమే : రాజమహేంద్రవరం రూరల్ కాతేరు వద్ద నీటి ముంపులోనే పొలాలు

అంగన్‌వాడీ గుడ్డు.. వెరీ బ్యాడ్



తాళ్ళపూడి, జూలై 25 : ఆ గుడ్డు చూస్తే గుండె గుబేల్ మంటుంది.. కాంట్రాక్టరు అశ్రద్ధ.. నిర్లక్ష్యం కారణంగా తల్లులు.. పిల్లలకు ఆపై గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలన్న ప్రభుత్వ ఉద్దేశం నీరు కారుతోంది. తాళ్ళపూడి మండలం అన్నదేవరపేట 96వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారనే సమా చారం కూటమి నాయకులకు అందింది. దీంతో హుటాహుటిన అన్న దేవరపేటకు చెందిన టీడీపీ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించగా కుళ్లిన కోడిగుడ్లు దర్శనమిచ్చాయి. ఇదే మిటని అక్కడ ఉన్న సిబ్బందిని ప్రశ్నించగా తమకు సరఫరా చేసిన గుడ్లు సగానికి సగం కుళ్లిపో తున్నాయని చెప్పడం గమనార్హం. కాం ట్రాక్టర్ వారానికి ఒకసారి సరఫరా చేయాల్సిన గుడ్లు 15 రోజు లకొక సారి వేస్తున్నారని అంతేకాక వారు ఎప్పుడు తెస్తే అప్పుడు తీసుకోవాలని సిబ్బంది వాపోతున్నారు.

పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు మోక్షం

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే బత్తుల వినతి



రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం భూసేకరణ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎత్తిపోతల పథకం సమస్యను పరిష్కరించాలని గురువారం అసెంబ్లీలో బలరామకృష్ణ చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన సీఎం వెంటనే స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారని తెలిపారు.పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం, చినకొండేపూడి, నాగంపల్లి గ్రామాల రైతులు తమ భూములు ఇవ్వగా 93 మంది రైతుల పరి హారం పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి ఇక్కడి సమస్యను తీసుకుని వెళ్లినట్టు చెప్పారు. సంబం ధిత ప్రిన్సిపల్ సెక్రటరీలకు సమస్య వివరించానన్నారు. సీఎం ఆదేశా లతో త్వరలోనే సమ స్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

జయజయహే..భారత్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 25: భారత్ సైన్యం పాకిస్తాన్‌పై విజయం సాధించిన దానికి ప్రతీకగా కార్గిల్ విజయ దివస్ దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని భారతీయ జనతా పార్టీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కందికొండ రమేష్ అన్నారు. భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో కార్గిల్ విజయ దివస్ గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆర్ట్స్ కళాశాల నుంచి లాలాచెరువు అమరవీరుల పార్కు వరకు ర్యాలీ చేశారు. అక్కడ అమరజవాన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ దేశ ప్రధాని మోదీ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా చేపట్టారని చెప్పారు. మాజీ సైనికుడు లెఫ్టినెంట్ కల్నల్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ 1999 మే 3న కార్గిల్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి భారత్-పాకిస్తాన్ యుద్ధం ప్రారంభమైందన్నారు. జూలై 26న భారత్ భూభాగంలోకి ప్రవేశించిన పాకిస్తాన్‌ను తరిమికొట్టి భారత్ విజయం సాధించిందని చెప్పారు. అప్పటి నుంచి కార్గిల్ విజయ దివస్ జరుపుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణ, కురగంటి సతీష్, కాలేపు సత్యసాయిరామ్, కందుకూరి మనోజ్, మరకాని సతీష్, షేక్ సాజిద్, ఖండవల్లి సాయి, సుంకర బాలు తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

జిల్లా వ్యవసాయశాఖాధికారి మాధవరావు

నిడదవోలు, జూలై 25: ఎర్రకాలువ వరదలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకొంటుందని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు అన్నారు. గురువారం నిడదవోలు మండలం తాళ్ళపాలెం, శింగవరం, కంసాలిపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఎర్రకాలువ వరద కారణంగా శింగవరం, తాళ్ళపాలెం, కంసాలిపాలెం గ్రామాల్లో వరి పంటకు పూర్తిగా నష్టం జరిగిందన్నారు. మండలంలో 8500 ఎకరాల్లో వరిపంట, 500 ఎకరాల్లో అరటి, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లిందని ఆయన చెప్పారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం


విద్యార్థులకు చట్టాలను వివరిస్తున్న న్యాయవాది మునీంద్ర

కొవ్వూరు, జూలై 25: పాఠశాలల్లో జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని సీనియర్ న్యాయవాది శ్రీరాముల నాగ మునీంద్ర అన్నారు. గురువారం కొవ్వూరు మావులేటి సోమరాజు సంస్కృత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మునీంద్ర ర్యాగింగ్, మాదకద్రవ్యాల నియంత్రణ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. జూనియర్ విద్యార్థుల పట్ల ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవర్ధనం శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వాల నమోదు

కొవ్వూరు, జూలై 25: కొవ్వూరులోని ఇందిరమ్మకాలనీలో గురువారం జనసేన క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేశారు. పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కె.నవ్య ఆధ్వర్యంలో నాలుగో విడత సభ్యత్వాలు నమోదు చేశారు. కార్యక్రమంలో 19వ వార్డు ఇన్‌చార్జి కొండ్రపు విజయ్‌కుమారి, 10వ వార్డు ఇన్‌చార్జి గుమ్మడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు. రెండో వార్డు వినాయకుని ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జనసేన పట్టణాధ్యక్షుడు డేగల రామ్‌కుమార్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కళ్యాణ్ నాయకత్వం చూసి ప్రజలందరూ స్వచ్ఛందంగా క్రియాశీలక సభ్యత్వాల కోసం ముందుకు వస్తున్నారన్నారని, అత్యధికంగా యువత నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలిశెట్టి శివ, తిరుమళ్ల గణపతి, డేగల నిఖిత, దాసరి వెంకటేశ్వరరావు, మహ్మద్ బహద్దూర్, వంగా సురేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు


కొవ్వూరు బస్టాండ్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొవ్వూరు, జూలై 25: కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్టు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎస్.విజయ, సాయిరాం డెంటల్ క్లినిక్ డాక్టర్ శ్రీలేఖ, డాక్టర్ మోహన్ డయాబెటిస్ స్పెషాలిటీ సెంటర్ నుంచి డాక్టర్ కోలా రమ్య, హర్షిణి ఆసుపత్రి వైద్యులు ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 96 మంది డిపో ఎంప్లాయిస్, వారి కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకున్నారని డిపో మేనేజర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, జూలై 25: మల్లేశ్వరం విద్యుత్ ఫీడర్‌లో లైన్ల మీద చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం ఈ నెల 26న ఉదయం 7నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ వీరభద్రరావు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ ఉదయం 4నుంచి 7గంటల వరకు, మధ్యాహ్నం 11నుంచి 4గంటల వరకు పిట్టవేమవరం, ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు. కొవ్వూరు మండలం దేచర్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఐ.పంగిడి, కాపవరం, దేచర్ల, గౌరీపట్నం, దుద్దు కూరు, ధర్మవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ తెలిపారు.

నల్లజర్ల గ్రంథాలయంలో వార్షిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు

నల్లజర్ల, జూలై 25: నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో గురువారం వార్షిక తనిఖీ నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు రికార్డులను పరిశీలించి, గ్రంథాలయ అనుబంధ పుస్తక పంపిణీ కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని లైబ్రేరియన్ ఏవీ రమణకు సూచించారు. రికార్డుల సక్రమంగా ఉపయోగించడంతో గ్రంథాలయ పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

తాళ్లపూడి, జూలై 25: మండలంలోని అన్నదేవరపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్‌ను టీడీపీ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య అందించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు, ఊరికి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అలాగే మలకపల్లిలో ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ ఊబా వెంకట్రావు ఆధ్వర్యంలో హెచ్ఎం వాసవి అధ్యక్షతన స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, ఉప సర్పంచ్ మద్దిపాటి రామారావు, మద్దిపాటి ప్రకాశరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోం మంత్రిని కలిసిన అల్లూరి


హోం మంత్రి అనితతో విక్రమాదిత్య, యువగళం టీం

తాళ్ళపూడి, జూలై 25: కొవ్వాడ కాలువతో ఇబ్బందులు పడుతున్న తాళ్లపూడి పరిసర మండలాల రైతులను ఆదుకోవాలని హోం మంత్రి వంగలపూడి అనితను కోరినట్టు అల్లూరి విక్రమాదిత్య తెలిపారు. గురువారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో వరదనీటిలో మునిగిన పొలాలు చెరువులను తలపిస్తున్నాయని, ఒక్క చుక్క కూడా నీరు బయటకు వెళ్లకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హోం మంత్రికి వివరించారు. ఆయన వెంట కూచిపూడి లక్ష్మణరావు, ఇంటి ప్రసాదు, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి ఉన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం



తాళ్ళపూడి, జూలై 25: ఇటీవల మృతి చెందిన పైడిమెట్ట గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ పసలపూడి సంజీవ్ కుటుంబాన్ని ఏపీ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోసిన వీరేంద్రకుమార్ ఆధ్వర్యంలో పరామర్శించి నివాళులర్పించారు. అసోసియేషన్ రూ.50 వేల అందజేశారు. కార్య క్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సిరి శ్రీను, బెజగం కోటేశ్వర రావు, నామన వెంకటభాస్కర్, తప్పెట్ల ప్రభాకర్, పరస రాజా పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ

పాఠశాలలకే పరిమితం చేయాలి

దివాన్‌చెరువు, జూలై 25: తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే పరిమితం చేయాలని ఎన్డీయూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సూరి జయత్రినాథబాబు ప్రభుత్వానికి సూచించారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ పథకం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి మాత్రమే పరిమితం చేస్తూ మార్గదర్శకాలు రూపొందిస్తే బాగుంటుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తంచేశారు.

కాల్వ గట్లకు మరమ్మతులు చేపట్టాలి

» సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ్

గోపాలపురం, జూలై 25: బలహీనంగా ఉన్న కాల్వ గట్లకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఐదు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని గంగోలు, రాజంపాలెం గ్రామాల మధ్య ఉన్న పోలవరం కుడికాల్వకు అనుసంధానంగా ఉన్న తాడిపూడి కాల్వ వంతెన వద్ద ఉన్న కుడిప్రధాన కాల్వ 11వ కిలోమీటర్ సమీపంలో గట్టు ఇరువైపులా కుంగింది. దీంతో అప్రమత్తమైన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కాల్వ గట్టుకు ఎదురు తడికలు, ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే వరద ముంపు ప్రాంతాల పరిశీలనలో భాగంగా వచ్చిన సబ్‌కలెక్టర్.. రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. మరమ్మతు పనులు వేగవంతం చేసి విధి నిర్వహణలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వనజాక్షి, ఇరిగేషన్ ఏఈ రాహుల్‌భాస్కర్, డీటీ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.


గంగోలు వద్ద కాల్వ గట్టు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

గోదావరి తగ్గుముఖం

» రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
» 13.40 అడుగులకు చేరిన నీటిమట్టం


బ్యారేజ్ గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు

ధవళేశ్వరం, జూలై 25: గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద గురువారం ఉదయం 9గంటలకు నీటి మట్టం 13.70అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఈ సమయంలో 12,7,028క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. నెమ్మదిగా తగ్గుతున్న నీటిమట్టం రాత్రి 7గంటల సమయానికి 13.40అడుగులకు చేరుకుంది. 12,27,273 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తోంది. ఎగువ భద్రాచలం వద్ద 45.20అడుగుల వరకు తగ్గిన నీటి మట్టం ఇంద్రావతి నుంచి వస్తున్న వరద నీటితో 24గంటల వ్యవధిలో మూడున్నర అడుగుల వరకు పెరిగి గురువారం సాయంత్రానికి 48.60అడుగుల వరకు పెరిగింది. ప్రస్తుతం నిలకడగా కొనసాగుతుండగా ఇంద్రావతి నుంచి వచ్చే వరద నీరు తగ్గడంతో భద్రాచలం వద్ద నీటి మట్టం తగ్గుముఖం పట్టనుంది.

ఎగువ ప్రాంతాల్లో తగ్గుతున్న నీటి మట్టం

ఎగువన అన్ని ప్రాంతాల్లో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. కాళేశ్వరం వద్ద గురువారం సాయంత్రానికి నీటిమట్టం 11.07మీటర్లుగా నమోదు కాగా పేరూరు వద్ద 16.33మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 13.20మీటర్లు, భద్రాచలం వద్ద 48.60అడుగులు, కూనవరం వద్ద 20.17మీటర్లు, కుంట వద్ద 11.50మీటర్లు, పోలవరం వద్ద 12.90 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.62మీటర్లుగా నీటిమట్టం నమోదయింది.

కొవ్వూరు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

» పలువురు మంత్రులకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వినతి

కొవ్వూరు, జూలై 25: కొవ్వూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లను కోరారు. గురువారం అమరావతిలో వారితోపాటు రోడ్డు, భవనాల ఆర్అండ్‌బీ శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖామంత్రి సోషల్ వెల్ఫేర్ మినిష్టర్ డోలా బాలా వీరాంజనేయులు, నీటిపారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడులకు పలు అంశాలపై వినతిపత్రాలు అందించామన్నారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి, ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీచేయాలని, వాడపల్లిలో ప్రభుత్వాసుపత్రికి, కొవ్వూరు సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌కు రూ.3 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. కుమారదేవం ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ.2,132లక్షలు, 5 రోడ్లు నిర్మాణానికి రూ.1620 లక్షలు, కొవ్వూరు మున్సిపాల్టీలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4 కోట్లు,ఆర్‌డబ్ల్యుఎస్-సీపీడబ్ల్యు స్కీంలో నియోజకవర్గంలో మంచినీటి సౌకర్యం కోసం రూ.96 కోట్లు, తుఫాను కారణంగా ముంపుకు గురయిన పొలాలకు పంట నష్టం అందజేయాలని, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, దొమ్మేరు పీహెచ్‌సీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలనే ప్రతిపాదనలను సంబంధిత మంత్రులకు అందించినట్టు ఎమ్మెల్యే ముప్పిడి పేర్కొన్నారు.


సంక్షేమ శాఖా మంత్రి వీరాంజనేయులును కలిసిన ఎమ్మెల్యే ముప్పిడి

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

సీడీపీవో శ్రీలక్ష్మి
భేటీ బచావో.. భేటీ పడావో


పెరవలి: కాపవరంలో సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీలక్ష్మి

పెరవలి, జూలై 25: గర్భిణులు, బాలింతలు, తల్లులు జాగ్రత్తలు తీసుకునేలా అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు చూడాలని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలక్ష్మి సూచించారు. బేటీ బచావో.. బేటి పడావో కార్యక్రమంలో భాగంగా మల్లేశ్వరం, కాపవరం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు, తల్లులకు జాగ్రత్తలు వివరించారు. వివాహ వయస్సు రాకుండా పిల్లలకు వివాహం చేయరాదని, అలా చేస్తే పలు సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. మల్లేశ్వరంలో జరిగిన కార్యక్రమంలో బాల సరస్వతి, స్వాతి, లక్ష్మీకాంతం, కరుణకుమారి హాజరయ్యారు. కాపవరంలో శ్రీనివాస్, సందీప్ తదితరులు హాజరయ్యారు.

చాగల్లు: చాగల్లులో బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అశోక్‌నగర్‌లోని 60, 61, 62, 63 కేంద్రాల వారు సంయుక్తంగా నిర్వహించిన బేటీ బచావ్, బేటీ పడావో కార్యక్రమంలో బాలల హక్కులు, బాల్యవివాహాలు బాలల అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కలిగించారు. గుడ్ టచ్, బేడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, ఏఎస్ఎం దుర్గ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


చాగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ


మోర్తలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేసిన దృశ్యం

ఉండ్రాజవరం, జూలై 25: మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు రాజమహేంద్రవరానికి చెందిన దిడ్ల సుధీర్‌బాబు ఆర్థిక సాయంతో నాలుగు వేల నోట్ పుస్తకాలను గురువారం అందించారు. వడ్లూరుకు చెందిన ఉపాధ్యాయురాలు కేవీఎల్ శిరీష, దిడ్ల సరస్వతి ప్రోత్సాహంతో సుధీర్‌బాబు పుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలోని వడ్లూరులోని హైస్కూలు, నెం.1, నెం.2 పాఠశాలలు, ఉండ్రాజవరం నెం.2, 3,4 పాఠశాలలు, మోర్త నెం.1, తాడిపర్రు నెం.2, వెలగదుర్రు ఎంపీపీ పాఠశాల, రెడ్డిచెరువు ఎంపీపీ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేశారని మోర్త నెం.2 పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎల్‌వీ ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా దాత సుధీర్‌బాబును విద్యార్థుల తలిదండ్రులు అభినందించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు శ్రీనివాస్

చాగల్లు, జూలై 25: కౌలు రైతులందరికీ ప్రభుత్వం గుర్తింపు కార్డులిచ్చి వడ్డీలేని పంట రుణాలు అందజేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. చాగల్లులో కడారి ప్రభాకరావు అధ్యక్షతన జరిగిన కౌలు రైతుల సంఘ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు అన్న దాత సుఖీభవ, పెట్టుబడి సాయం అందజేయాలన్నారు. ఇటీవల వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ పంట నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు గారపాటి సుబ్బారావు, కంకటాల బుద్ధుడు, సీఐటీయూ నాయకుడు కేకే దుర్గారావు, కౌలు రైతుసంఘం నాయకులు తోటేటి గన్నియ్య, శ్రీరంగం రాము, గూడూరి సూర్య చంద్రం పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఇవ్వాలి

నిడదవోలు, జూలై 25: నిడదవోలులోని సామాజిక ఆరోగ్య కేంద్ర వద్ద ఆర్టీసీ బస్సులకు రిక్వెస్ట్ స్టాప్ ఇవ్వాలిని కోరుతూ గురువారం సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు డిపో మేనేజర్ శ్రీరామ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై డీఎం సానుకూలంగా స్పందించి రిక్వెస్ట్ స్టాప్‌కు అనుమతి ఇస్తానని హామీ ఇచ్చారు.

శాకంబరిగా లలితా పరమేశ్వరి

ఉండ్రాజవరం, జూలై 25: ఆషాఢ మాసం సందర్భంగా ఉండ్రాజవరంలో శ్రీబాల త్రిపుర సుందరి సమేత గోకర్ణేశ్వరస్వామి ఆలయంలో లలిత పరమేశ్వరి తల్లిని గురువారం శాకాంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు.

పాలంగిలో పారిశుధ్య పనులు

ఉండ్రాజవరం, జూలై 25: మండలంలోని పాలంగిలో సర్పంచ్ బొక్కా శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. స్థానికంగా ఉన్న కాలువలో చెత్తను తొలగించి, కచ్చా డ్రైన్లలను శుభ్రం చేశారు. ప్రొక్లెయినర్‌తో డ్రైన్లలను తవ్వి, రోడ్లకు తూరలు ఏర్పాటు చేశారు. కచ్చా డ్రైన్లలో మురుగునీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్‌జానీ, సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం జిల్లాకు తమ్మనదొర పేరుపెట్టాలి

ఆదివాసీ మహాసభ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25 : బ్రిటీష్ వారితో పోరాడిన తొలి గిరిజన వీరుడు కారం తమ్మనదొర పేరును రంపచోడవరం జిల్లాకు పెట్టాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కారం తమ్మన్నదొర 145వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలైన సందర్భంగా జరిగిన ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా కారం తమ్మన్నదొర చరిత్ర వెలుగులోకి వచ్చిందన్నారు. సమావేశంలో ఆదివాసి మహాసభ ప్రతినిధులు అరగంటి వీరభద్రారెడ్డి, గిడుతూరి చిన్నారావు, కెచ్చెల అబ్బాయిరెడ్డి, కారం శ్రీనివాసు దొర, జక్కుల పాండవులు, కారం చిన్నపోతురాజు, మడి అప్పన్నదొర, కారం చిట్టెమ్మ పాల్గొన్నారు.

28న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డికి సత్కారం

కాపు సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు రామినీడి మురళీ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేగా గెలిచిన ఆదిరెడ్డి శ్రీనివాస్‌ల సత్కార సభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు కాపు సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు రామినీడి మురళీ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హోటల్ ఆనంద్ రీజెన్సీలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు సత్కార సభ ఉంటుందన్నారు. సత్కారోత్సవానికి పార్టీలకతీతంగా కాపులంతా విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు అల్లూరి శేషనారాయణరావు, దొండపాటి సత్యంబాబు, చింతం వీరబాబు, మీసాల నాగు పాల్గొన్నారు.

విమానాశ్రయం ముంపు నీరు పరిశీలన



నల్లా చెరువుకు వెళ్లాల్సిన ముంపు నీటిని పరిశీలిస్తున్న ఆర్డీవో చైత్రవర్షిణి

కోరుకొండ, జూలై 25: మధురపూడి విమానాశ్రయం వద్ద నిలిచిపోయిన ముంపునీటిని ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి గురువారం పరిశీలించారు. అధిక వర్షాలు కురిసినప్పుడు నీరు విమానాశ్రయం నుంచి మధురుపూడి గ్రామ పరిధిలోని నల్లా చెరువులకు వెళ్లవలిసి ఉందని, ఆ సమయంలో నల్లా చెరువు చుట్టు పక్కల పొలాలు ముంపునకు గురవుతాయన్న భయంతో రైతులు పూడ్చి వేశారని, అందువల్ల విమానాశ్రయంలోని వరదనీరు బయటకు పోయే మార్గంలేక ఎయిర్‌పోర్టులోనిలిచిపోవడంతో ముంపు గోదావరిలా మారిందని అధికారులు ఆమెకు వివరించారు. ఈ మొత్తం పరిస్థితిని ఆర్డీవో పరిశీలించారు. ఆమె వెంట తహశీల్దార్ డి.రాజ్యలక్ష్మి, డీటీ ఎస్వీ నరేష్, ఇరిగేషన్ అధికారులున్నారు.

ఆవ భూముల అవకతవకలపై

సీబీఐ దర్యాప్తు జరిపించండి

బీజేపీ ఇన్‌చార్జ్ నీరుకొండ



కోరుకొండ, జూలై 25: గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చే ముసుగులో మండలంలోని బూరుగుపూడి ఆవభూముల కొనుగోలులో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయని, వాటిపై ప్రభుత్వం సీబీఐతో సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం కోరుకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆవ భూముల్లో నెలల తరబడి సుమారు 10అడుగుల లోతున నీరు నిలిచి ఉంటుందని, అలాంటి భూములకు రూ.40 లక్షలు చెల్లించి 25వేల మంది పేదకుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని కొనుగోలు చేశారన్నారు. సుమారు 300 ఎకరాల్లో అప్పటి ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇచ్చిందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలు వందల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయన్నారు. ఆ భూములు ఇళ్ల నిర్మాణానికి పనికిరావని పలు సంస్థలు నివేదికలు ఇచ్చాయని, హై కోర్టు కూడా ఆవభూముల్లో ఇళ్ళ కేటాయింపుపై అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. దీనిపై ప్రస్తుత శాసన సభ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం సమగ్రంగా చర్చించాలని, సీబీఐతో సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పలువురు ప్రభుత్వ పెద్దలను కోరారు.

ముఖ్యమంత్రిని కలిసిన 'ఆర్యాపురం' ప్యానల్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25: ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్యానల్‌ను సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరిచయం చేశారు. గురువారం అసెంబ్లీ సమావేశాలు అయ్యాక విజయవాడలో చంద్రబాబు చాంబర్‌లో ఆయన్ను బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, డైరెక్టర్లు యెనుముల రంగబాబు, పొలాకి పరమేష్, శ్రీనివాస్ (పెదకాపు), శ్యామ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి పరిచయం చేశారు. కూటమి ప్యానల్‌ను విజయం పట్ల ఆయనను చంద్రబాబు అభినందించారు. ప్యానల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంక్‌ను అభివృద్ధి పథంలో నడింపించాలని చైర్మన్ చల్లాకు సూచించారు.

రేపు, ఎల్లుండి ఎస్పీ బాలు స్వర స్మరణోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 25: ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలు స్వరస్మరణోత్సవాన్ని ఈనెల 27,28 తేదీల్లో విక్రమహాల్లో నిర్వహిస్తున్నామని రాకా సంస్థ ప్రధాన కార్యదర్శి జి.రమణ తెలిపారు. రాజమండ్రి రాకా సాంస్కృతిక సంస్థ, ధవళేశ్వరం గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎస్పీ బాలు పాటల పోటీలు ఉంటాయని, బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. వివరాలకు 832805 9683, 91007 53156 నెంబర్లలో సంప్రదించాలన్నారు.సంగీత ప్రియులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

జగన్‌కే వైసీపీలో సభ్యత్వం లేదు..
అతని ధోరణి చూడలేకనే కాంగ్రెస్‌లోకి చేరా

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25: వైసీపీలో మాజీ సీఎం జగన్ కే సభ్యత్వం లేదని ఆ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం పేపరుమిల్లు ఎదురుగా ఉన్న కృష్ణసాయి కల్యాణ మండపంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్ఆర్ మరణించాక తండ్రి ఆశయాల ప్రకారం పనిచేస్తాడని తాను ఆనాడు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలోకి చేరానని చెప్పారు. కానీ జగన్ కేవలం సీఎం పదవికోసమే చూశాడని పార్టీలో ప్రజావ్యతిరేక విధానాలనే అవలంబించాడన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చాక కనీసం సభ్యత నమోదు ప్రక్రియ నిర్వహించలేదన్నారు. ఆ పార్టీలో కార్యకర్తలను కనీసం మనుషులుగా కూడా చూడరన్నారు. అది తట్టుకోలేకే తాను ఈనెల 23న విజయవాడలో షర్మిలరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరానని చెప్పారు. వైఎస్ షర్మిళారెడ్డి న్యాయకత్వంలో పార్టీని మరింతగా బలోపేతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బోడా వెంకట్, మార్టిన్ లూథర్, బాలేపల్లి మురళీధర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కిషోర్ జైన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మోతా శారద, సీతానగరం, కోరు కొండ మండల అధ్యక్షులు నల్లా వీర్రాజు, దోసపాటి సత్యప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో జగన్ ధర్నా అట్టర్ ప్లాప్

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25: దేశరాజధాని ఢిల్లీలో జగన్ చేసిన ధర్నా అట్టర్ ప్లాప్ అయ్యిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. కంబాలచెరువు వద్ద తన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన జగన్ ఆత్మపరిశీలన చేసుకోకుండా ఎలాగోలా రాష్ట్రాన్ని ఇరుకులో పెట్టాలనే కుట్ర చేస్తున్నాడని మండిపడ్డారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో 2686 హత్యలు జరిగితే కనీసం స్పందించలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కేవలం 30రోజుల్లో 30 మంది హత్యకు గురయ్యారని చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ఆ 30 మంది ఎవరెవరో చెప్పమని జాతీయ మీడియా ప్రశ్నిస్తే నీళ్లు నమిలాడన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కల్కి
వై.స్క్రీన్2	భారతీయుడు-2
దేవిశ్రీ(గాయత్రి	ప్రభుత్వ జూనియర్ కళాశాల
అనన్య	భారతీయుడు-2
నిడదవోలు	
వీ మ్యాక్స్	డార్లింగ్
రాధాకృష్ణ	కల్కి
శ్రీగణపతి	భారతీయుడు-2
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భారతీయుడు-2
స్క్రీన్ 2	కల్కి
శ్రీనివాస	---